# అంతర్జాతీయ గుర్తింపు దిశగా మంజీర వన్యప్రాణుల కేంద్రం

**-సంగారెడ్డి జిల్లాకు దక్కనున్న అరుదైన గౌరవం**

**సంగారెడ్డి టౌన్, జూన్ 24, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాకు అరుదైన గౌరవం దక్కనుంది. జిల్లాలోని మంజీర వన్యప్రాణుల అభయారణ్య కేంద్రానికి అంతర్జాతీయ గుర్తింపు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సోమవారం జిల్లాలో ఉన్న మంజీర వన్యప్రాణుల కేంద్రంను డిఎఫ్ఓ శ్రీధరరావు, ఈఎఫ్ఎస్అండ్‌టి ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్, జాయింట్ సెక్రటరీ ప్రశాత్‌జీ, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఈటిఆర్ఐ శాస్త్రవేత్తలు, పక్షుల పరిశీలకులు, మంజీర వల్డ్ లైఫ్ శంక్చురీని సందర్శించారు. మంజీర నుంచి సింగూరు డ్యాం వరకు మంజీర రివర్‌లో 20 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణం ఉందని, నీటి ప్రదేశంలో 9 ద్వీపాలు ఉన్నాయని, ద్వీపాలను పడవ ద్వార తప్ప ఇతర మార్గల ద్వార వెళ్లి చూడలేమన్నారు. అభయారణ్యం సరిహద్దు నుంచి 1000 మీటర్ల వరకు ఎకోసెన్సిటివ్ జోన్ నోటిపై చేయబడిందన్నారు. మంజీర వైల్డ్ లైఫ్ శాంక్చురీలో జీవవైవిద్యం ఉండటంతో రాంసర్ సైట్‌గా ప్రకటించే అవకశాన్ని అంచనా వేయడం జరిగిందని జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావు, శ్రీరామిరెడ్డిలు తెలిపారు. అభయారణ్యంలో లభ్యమయ్యే జంతుజాలం వైవిద్యాన్ని వారు వివరించారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# ప్రైవేటు వైద్యశాలలపై డిఎంహెచ్ఓ దాడులు..అనుమతి లేని ల్యాబ్ సీజ్

**జహీరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను డిప్యూటీ డిఎంఆండ్‌హెచ్ఓ డాక్టర్ బి శంకర్, సిహెచ్ఓ రవికుమార్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అనుసరించి పట్టణంలోని రెడ్‌క్లిఫ్ఫ్ ల్యాబ్స్ ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతుండటాన్ని గమనించి ల్యాబ్‌ను డాక్టర్లు సీజ్‌జరిమాన విధించారు. అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లీనిక్‌లు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను నిర్వహిస్తే చర్యలు తప్పవని డాక్టర్ శంకర్ హెచ్చరించారు.



డయాగ్నస్టిక్ సెంటర్‌ను సీజ్‌చేస్తున్న దృశ్యం



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమ ం..సామాన్యులకు అందుబాటులో ఉండి సమస్యలను విన్నవించుకుని పరిష్కరి ంచుకోవడానికి ఒక చక్కని వేదిక అని జిల్లా అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆమె జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణికి ఎంతో నమ్మకంతో సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రజల వస్తుంటారని వారికి న్యాయం చేయాల్సి న బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కోసం మహిళలకు ఉచిత శిక్షణ

**సిపి అనురాధ**



మాట్లాడుతున్న సిపి అనురాధ

**సిద్దిపేట అర్బన్, జూన్ 24, ప్రభాతవార్త :** మహిళా పోలీసు స్టేషన్, భరోసా సెంటర్, స్నేహిత మహిళా కౌన్సిలింగ్ వచ్చిన మహిళ బాధితులకు నిరుద్యోగులైన మహిళలకు జీవితంపై భరోసా కల్పించేలా నాబార్డు ద్వారా ఉచితంగా టైలరింగ్, బ్యూటిషన్, కంప్యూటర్ అపరేటింగ్ ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సీపీ డా॥అనురాధ తెలిపారు. సీపీ కార్యాలయంలో సోమవారం మహిళలకు ఉచిత శిక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. శిక్షణ నేర్చుకోవడానికి ముందుకు వచ్చిన మహిళలకు తర్వలో శిక్షణ ఇప్పించడానికి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత షాప్స్ పెట్టుకోవడానికి అసక్తిగల మహిళలకు యువతులకు యూనియన్ బ్యాంకుద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. మహిళలు అన్నిటిలో రాణించాలన్నారు. శిక్షణను క్రమం తప్పకుండా ప్రతి రోజు నేర్చుకోవాలన్నారు. మహిళలు ఎవరి కాళ్ల మీద వారు నిలబడడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్ సిబ్బంది బాధిత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి పాల్పడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

**సిద్దిపేట అర్బన్, జూన్ 24, ప్రభాతవార్త :** టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పి.రవీందర్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో విచారణ చేసి సస్పెండ్ చేస్తూ సోమవారం సీపీ డా॥అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్ పి.రవీందర్ ఇసుక లారీలు, ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నాడని అరోపణలు రాగా విచారణ చేపట్టిన అనంతరం నిజమని తేలడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**హామీలు అమలు చేయకుంటే**

## రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి

**-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, జూన్ 24 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ చెప్పిన తేదీలోపు హామీలు అమలు చేయకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామాకు సిద్ధమా అని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలు, 13 హామీలను రేవంత్‌రెడ్డి చెప్పిన తేదీలోపు అమలు చేయాలన్నారు. ఎంతసేపు గత ప్రభుత్వంపై నిందలు మోపడంతప్ప ఆరునెలల కాలంలో కాంగ్రెస్ చేసిందేమీలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 13 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకాన్ని గాలికి వదిలేసి రోజుకో డ్రామాతో కాంగ్రెస్ నాయకులు పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. రైతు భరోసాలో రైతులకు, కౌలు రైతులకు రూ.15వేల పెట్టుబడి సహాయం తక్షణమే అందించాలన్నారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. కొనుగోలు చేసిన వరిధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్‌చేశారు. తెలంగాణలో ప్రతి మండలానికి అధునాతనమైన సౌకర్యాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటర్నేషనల్ స్థాయిలో ఉన్నత పాఠశాలలను ఏర్పాటుచేసి ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్ళు పైబడి చదువుకునే ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటీని అందించాలన్నారు. ఇవన్నీ అమలుచేయడం చేతకాక కాలయాపన చేస్తున్నారని, ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులలో సఖ్యత లేదని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాత గత ప్రభుత్వంపై విమర్శలు చేయాలని విమర్శించారు.

## తప్పిపోయి పోలీసు ఠాణాకు చేరిన బాలుడు



**సంగారెడ్డి టౌన్, జూన్ 24, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని మల్లిగొండకు చెందిన 7 సంవత్సరాల బాలుడు సంగారెడ్డి బస్సెక్కి సంగారెడ్డికి వచ్చి పోలీసు ఠాణాకు చేరుకున్నాడు. తప్పిపోయి సోమవారం సాయంత్రం తప్పి వచ్చిన బాలుడు పోలీసు ఠాణకు చేరుకుని తన పేరు అర్బజ్ అని తన తండ్రి ఆరిఫ్ అని హైద్రాబాద్‌లోని మల్లిగొండ అని చిరునామ చెప్పాడని పట్టణ పోలీసు ఠాణా ఎస్ తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో ఏడుస్తూ కానవచ్చిన బాలుడిని స్థానికులు గుర్తించి బాలుడిని పోలీసులకు అప్పగించారు. తప్పి వచ్చిన అబ్బాయిని గుర్తిస్తే సంగారెడ్డి పట్టణ పోలీసు ఠాణాను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

# విద్యా, వైద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తా

**రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ / హుస్నాబాద్ రూరల్, జూన్ 24,ప్రభాతవార్త**

యువజన సర్వీసుల శాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. సోమవారం నిర్వహించిన ఈ జాబ్ మేళాలో నియోజకవర్గంతో పాటు వివిధ మండలాలు, జిల్లాల నుండి 8వేలవరకు నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారు. అందులో 5 వేలకు పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి అందులో 1310 మందికి తక్షణమే ఆర్డర్ కాపీలు ఇవ్వడంతోపాటు 3887 మందికి షార్ట్‌లిస్ట్ తయారు చేసి కంపెనీలలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలసి మాట్లాడారు. షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థులు కంపెనీలకు వెళ్లి శిక్షణ పొంది ఉద్యోగాలలో చేరాలన్నారు. తదుపరి నిర్వహించే జాబ్‌మేళాను మండలాల వారీగా నిర్వహిస్తామని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తానన్నారు. ఇటీవల ఒక సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గంనుండి ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీటు సాధించిన ప్రతీ విద్యార్థికి పూర్తి ఫీజులు భరిస్తానని ప్రకటించానని, దానికి కట్టుబడి పనిచేస్తానన్నారు. జాబ్‌మేళా కార్యక్రమాలు రానున్న రోజుల్లో మండలాల వారిగా నిర్వహించడంతో పాటు ప్రతీ ఒక్కరికీ ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. చదువుకోని వారికి సైతం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించి అవసరమైతే విదేశాలకు పంపించే ఆలోచన చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నిర్వహించిన జాబ్‌మేళాకు 50కి పైగా కంపెనీలు వచ్చాయని ఒకే దక్కర ఇన్ని కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించడం శుభపరినామం అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డివో రాంమూర్తి, తహసీల్దార్ రవిందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, ఎసిపి వాసాల సతీష్‌తో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**పర్యాటక ప్రాంతంగా మహాసముద్ర గండి...**

హుస్నాబాద్‌కు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్మాపూర్ గ్రామంలోని మహా సముద్ర గండిని రానున్న రోజుల్లో పర్యాటక కేంద్రంగా మారుస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మహాసముద్ర గండిని జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి పరిశీలించారు. ఎతైన గుట్టల మద్య ఉన్న చెరువును ఎంతో మంది పర్యటకులు వస్తారని అక్కడి ప్రజల ద్వార తెలుసుకున్న మంత్రి టూరిజం వారితో సమావేశం నిర్వహించి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడకు వచ్చే పర్యటకులకు రోడ్డు సౌకర్యం లేదని రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

# శనిగరం జలాశయ రక్షణకు ప్రభుత్వ సహకారం

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి**



శనిగరం జలాశయాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

**కోహేడ, జూన్ 24, ప్రభాతవార్త:** జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన మధ్యతరహా జలాశయం రెండు మండలాలలో 10 గ్రామాలకు సాగునీరు అందించే శనిగరం జలాశయా రక్షణకు సంబంధించి ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని శనిగరం జలాశయాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ జలాశయం 1 టిఎంసి నీటి సామర్థ్యంతో కోహేడ, బెజ్జంకి, మండలాల్లో 5100 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని ఇటీవల రూ.2 కోట్ల 78 లక్షలతో స్క్రీన్ వాల్‌ను నిర్మించామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలాశయంకు నాచురల్ ఫ్లో ఉన్నందున్న భారీ వర్షాలు కురిసినప్పుడు జలాశయాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నీరు మత్తడి నుంచి దూకే క్రమంలో పర్యటకులకు లోనికి పోకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్‌శాఖ డిఈ విద్యాసాగర్, కొహడ తహసీల్దార్ సురేఖ తదితరులు ఉన్నారు.

# గుండె పోటుతో బిఆర్ఎస్ నేత మృతి

**కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్‌రావు**

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని జక్కపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తాజా మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి భర్త దుప్తల శ్రీనివాస్(50) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్‌రావు, ఆయా పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వెంకట్రామ్‌రెడ్డి, చంద్రాగౌడ్, మన్సూర్, బోగ శేఖర్, ఈ.శివకుమార్, పంబల్ల బిక్షపతి, వెంకటనర్సింగరావు, శ్రీనరివాస్‌గుప్త, సోమన్నగారి రవిందర్‌రెడ్డి, ఫాక్స్ చైర్మన్ రాజుయాదవ్, హాబీబ్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు గుండెశివకుమార్, లక్ష్మణ్‌గౌడ్, ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు జక్కపల్లి గ్రామానికి వెళ్లి మృతి చెందిన శ్రీనివాస్ మృతదేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్బంగా మృతుడు శ్రీనివాస్ బార్య వెంకటలక్ష్మి బోరున విలపించింది. దీంతో ప్రతి ఒక్కరు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడు శ్రీనివాసన జక్కపల్లి, చిప్పల్‌తుర్తి గ్రామాల్లో మంచి పేరను తెచ్చుకున్నాడు. దీంతో ఈ గ్రామాలలో విషాదచాయలు అలుమకున్నాయి. అనంతరం తన స్వంత నరగామం జక్కపల్లిలో మృతుడు శ్రీనివాస్ అంత్య క్రియలు జరుగగా ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీనివాస్ కుటుంభ సభ్యులను పరామర్శిస్తున్న హరీష్‌రావు తదితరులు

# సుడా చైర్మన్ పదవి ఎవరిని వరించేనో!.

**కీలక నేతల అశీస్సుల కోసం ఆశావహుల చక్కర్లు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

సిద్దిపేట సుడా చైర్మన్ పదవి దక్కించుకోవడానికి అరడజన్‌కు పైగా ఆశావాహులు ఆశిస్తున్నారు. సుడా చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంత కాలం నుంచి జోరుగా పైరవీలు సాగిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత నామినేటేడ్ పోస్టులు భర్తీ చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడంతో ఆ పార్టీ నాయకులు ఎలాగైనా సుడా చైర్మన్ పదవి దక్కించుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. అశావాహులు మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, దామోదర రాజనరసింహా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిల ప్రసన్నం కోసం గత కొంత కాలం నుంచి హైదారాబాద్ చుట్టూ చక్కర్లు కోడుతున్నారు. సిద్దిపేట అర్బన్ ప్రాంత అభివృద్ధియే ధ్యేయంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2017 డిసెంబర్‌లో సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. సుడా పరిధిలో సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని చిన్నకోడూరు, సిద్దిపేట అర్బన్, సిద్దిపేట రూరల్ మండలాలతో పాటు, గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కొండపాక మండలాల్లోని 26 గ్రామాలతోపాటు సిద్దిపేట మున్సిపాలిటీని భాగం చేశారు. తొలుత సుడా పాలక వర్గానికి చైర్మనతో 13 మంది డైరెక్టర్లను నియమించారు. 2017లో ఏర్పాటైనా పాలక వర్గ కమిటీ 2023 వరకు కొనసాగుతు వచ్చింది. 2023 చివరిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సుడా పాలక వర్గాన్ని రద్దు చేసింది. అప్పటి నుంచి నేటీ వరకు నూతన పాలకవర్గాన్ని నియమించలేదు.

**అరడజన్‌పైగా అశావాహులు**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సిద్దిపేట సుడా చైర్మన్ పదవి కోసం అర డజన్‌కుపైగా నాయకులు అశిస్తున్నారు. పదవిని ఎలాగైనా దక్కించుకోవడానికి సీనియర్ నాయకులు నరకుల్ల శివప్ప, దరిపల్లి చంద్రం, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, గాదగోని చక్రధర్‌గౌడ్, బొమ్మల యాదగిరి, సొప్పదండి చంద్రశేఖర్, అత్తు తదితరులు జోరుగా పైరవీలు సాగిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే బిసి వర్గానికే సుడా చైర్మన్ పదవి వరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈసారి కొండపాక మండలం నుంచి నాయకులుసైతం సుడా చైర్మన్ పదవిపై కన్నేసినట్లు విశ్వసనీయ సమాచారం. తమకంటే తమకే సుడా చైర్మన్ పదవి దక్కుతుందని ఆశావాహులు జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా సిఎం రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్టానంతోపాటు జిల్లా మంత్రుల అశీస్సులు ఎవరిపై ఉంటాయో తెలియలంటే వేచి చూడాల్సిందే.




సిద్దిపేట సుడా కార్యాలయం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా ఎస్పీ బాలస్వామి**

**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 24 ప్రభాతవార్త:** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ బాలస్వామి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదిదారుల సమస్యలను విని వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఎస్పీ బాలస్వామి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన గోగుల కనకమ్మ మేము రోజు ఎల్లమ్మ బండ దగ్గర బండ పని చేసుకొని మా పని సామాగ్రి అక్కడే దాచిపెట్టడం జరిగిందని, మరుసటి రోజు మేము ఎల్లమ్మ బండ దగ్గరకు వెళ్లి మా సామాను దాచిపెట్టిన దగ్గర వెళ్లి చూడగా పని సామాగ్రి అక్కడ లేదని, మా సామాగ్రి అక్కడ లేదని తిట్టుకుంటుండగా అక్కడ ప్రక్కన ఉన్న కొందరు వ్యక్తులు నన్ను నోటికి ఇష్టం వచ్చినట్లు తిట్టారని, కావున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా, చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని శివ్వంపేట ఎస్ఐకి సూచించారు. అలాగే చిలిపిచెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మంగలి కిష్టయ్య నాకు చిట్కుల్ గ్రామ శివారులో సొంత పట్టా భూమి కలదని, అట్టి సర్వే నెంబర్ 484/1 లో 19 గుంటలు, 529/ఆ లో 0.05, 530/ఇ1 లో 0.216 గుంటల భూమి కలదని, అయితే ఈ విషయమై మా తమ్ముడి భార్య మంగలి పద్మ మా ఇరువురి కుటుంబాల మధ్య ఒరాల సరిహద్దుల విషయంలో తగాదాలు నడుస్తున్నాయని, ఈ విషయంలో కోర్టులో కేసు కూడా నడుస్తుందని, కోర్టు తీర్పును నేను శిరసావహిస్తానని, కానీ దౌర్జన్యంగా నా భార్య పద్మ అల్లుడు, వారి తమ్ముడువచ్చిన ఈనెల 11న మంగలి శంకరయ్య డాకూర్ గ్రామం, మంగళి యాదగిరి, మంగలి గంగారం చౌటకూర్ గ్రామం, మంగలి వేణు అంగడగిపేట వారు మమ్ములను దౌర్జన్యంగా గొడ్డలి, కర్రలతో వచ్చి నా పొలంలో ఒరాటు దౌర్జన్యంగా చేస్తున్నారని, ఈ విషయమై నేను అక్కడికి వెళితే నాపై దాడి చేయడానికి ప్రయత్నించారని, పైన తెలిపిన వారి వల్ల నాకు ప్రాణ భయం ఉందని, కావున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయయాలని ఫిర్యాదు చేయగా చట్ట ప్రకారం ఫిర్యాదికి న్యాయం చేయమని చిలిపిచెడ్ ఎస్ఐకి సూచించారు.

## విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన ప్రభుత్వం

**ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య**




మాట్లాడుతున్న ఆదిత్య

**హుస్నాబాద్ టౌన్, జూన్ 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి విద్యావ్యవస్థను గాలికి వదిలేసిందని ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్రాల భవిష్యత్తును నిర్మాణం చేసేది విద్యా వ్యవస్థ అని ఇలాంటి వ్యవస్థపై ప్రభుత్వంకు పట్టింపు లేకుండా పోవడం సిగ్గుచేటన్నారు. పాఠశాలలు ప్రారంభమై 20రోజులు కావస్తున్నా ఇప్పటివరకు రాష్ట్రంలో అనుమతులు లేకుండా నడుస్తున్న కళాశాలలు, పాఠశాలలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతోపాటు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దంపడుతుందన్నారు. దీనికి నిరసనగా ఈనెల 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎబివిపి ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి రాకేష్, ఉపాధ్యక్షులు రాజేష్, నాయకులు చరణ్, డిగ్రీ కళాశాల కార్యదర్శి రాహుల్, రాజులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోండి

**ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్**

**గజ్వేల్, జూన్ 24 (ప్రభాతవార్త):** ఆగస్టు 15వ తేదీలోగా ఏక కాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలను, 13 హామీలను అమలుచేసి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని గజ్వేల్ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా హరీష్‌రావు చేసిన సవాల్‌కు సిద్ధంగా ఉన్నారని, దమ్ముంటే ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తే కాంగ్రెస్ నాయకులు భరించలేకపోతున్నారని అన్నారు. అధికారంలోకి రావడానికి పలు డిక్లరేషన్లు, గ్యారంటీలు, బాండ్ పేపర్లు రాసి ఇచ్చినా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు కొత్తవి ఇవ్వడం పక్కన పెట్టి పాత పథకాలు కొనసాగించడంలేదన్నారు. పేదలకు ఇచ్చే పెన్షన్, రైతులకు ఇచ్చే రైతుబంధు, అనేకపథకాలకు కొర్రిల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. తెలంగాణ దేశంలోనే 1-5 స్థానాలకు పోటీపడితే ఇప్పుడు పక్కనున్న రాష్ట్రంతో పోటీపడి పనిచేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తామనడం సిగ్గుచేటన్నారు. హరీష్‌రావు ఉద్యమంలో పుట్టిన నాయకుడు అని, ప్రజలకు దగ్గరగా ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ అటు ఉద్యమంలో, ఇటు మాజీ మంత్రిగా ప్రజా నాయకునిగా ఎదిగారన్నారు. హరీష్‌రావుకు పదవులు కొత్త కాదని, కెసిఆర్ ఆదేశించి తెలంగాణ సమాజం పిలుపునిస్తే గతంలో ఎన్నో సందర్భాలలో తన మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి హరీష్‌రావు సిద్ధంగా ఉన్నారని, దమ్ముంటే సిఎం రేవంత్‌రెడ్డి హరీష్‌రావు చేసిన సవాల్ స్వీకరించి రుణమాఫీ, ఆరు గ్యారంటీలను ఆగస్టు 15 లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో ప్రజలందరినీ ఏకంచేసి పోరాటం మరింత ఉధృతం చేసి ప్రభుత్వం మెడలు వంచి హామీలను నెరవేర్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

## అల్వాల్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి


జడ్‌సికి వినతి పత్రం అందిస్తున్న దండుగుల వెంకటేష్

**అల్వాల్, జూన్ 24 ప్రభాతవార్త:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌లో ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు బిజెపి నేతలు వినతి పత్రం అందచేశారు. బిసి మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దండుగుల వెంకటేష్ నేతృత్వంలోని నేతలు జాయింట్ కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. ప్రతి మండలంలో దానికి సంబంధించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని తెలిపారు. 13 కిలోమీటర్లు దూరంలోని హైదరాబాద్ జిల్లా పరిధిలోని బేగంపేటలో అల్వాల్‌కు చెందిన కార్యాలయం ఉండడం ఎంత వరకు సమంజసమని తెలిపారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ విషయంలో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ ఏర్పాటుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిఖార్జున్ గౌడ్, సాయి, ఆనంద్, సుజాత, ప్రదీప్ పాల్గొన్నారు.

## అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌కు తెలంగాణ స్టేట్ పోలీసు సేవా పతకం

**అల్వాల్, జూన్ 24 ప్రభాతవార్త:** అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌కు తెలంగాణా స్టేట్ పోలీసు సేవా పతకం లభించింది. శాంతి భద్రతలు పరిరక్షణలో ఉత్తమ సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా సేవా పతకాలను అందిస్తుంది. 2007వ బ్యాచ్‌కు చెందిన ఆయన నల్గొండ జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌లులో విధులు నిర్వహించారు. అనంతరం స్పెషల్ సెల్ విభాగంలో 5 సంవత్సరాలు పని చేశారు. సైబారాబాద్ ఎస్‌ఓటిలో సంవత్సరం కాలం పాటు సేవలు అందించడం జరిగింది. ఆరు నెలలుగా అల్వాల్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్‌కు సేవా పతకం లభించిన నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు.

## కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం


కమ్యూనిటీ హాల్ పనుల కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్, స్థానికులు

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్‌లో రూ. 50లక్షల వ్యయంతో నూతనంగా ప్రారంభిస్తున్న కమ్యూనిటీ పనులను సోమవారం డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ పనులను నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంజునాథ్, 191 ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ శోభారాణి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి మున్సిపల్ ఇంజినీర్ అరుణ్, కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డి, సూపర్వైజర్ సురేష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

**-రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డిసి రవి కుమార్**



**అత్తాపూర్ జూన్24,ప్రభాతవార్త :**
ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరగుతుందని డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిప్యూటి కమిషనర్ రవి కుమార్ ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం డిసి మాట్లాడుతూ...సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 5 ఫిర్యాదులు అందాయని తెలిపారు .ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సత్వర పరిష్కారానికి చొరవ చూపుతామని తెలిపారు.ప్రతి ఒక్కరూ ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు,ఫిర్యాదుదారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎంల గోదాంను పరిశీలించిన కలెక్టర్



**అత్తాపూర్ జూన్24,ప్రభాతవార్త :**
పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనియ ఘటనలు, అవకతవకలు జరగకుండా ప్రశాంతవాతావరణంలో నిర్వహించుకోవడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు.సోమవారం చేవెళ్ల పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల ఈవిఎంలను రాజేంద్రనగర్ మండల తహసీల్దార్ కార్యాలయం పక్కన భద్రపరిచిన గోదాంను తహసీల్దార్ రాములు,వివిధ పార్టీల నేతలతో కలిసి కలెక్టర్ శశాంక పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పార్లమెంట్ ఎన్నికలు జరిగి 45 రోజులు కావడంతో ఈసి ఆదేశాల మేరకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందకపోవడంతో వివిధ పార్టీల నాయకుల సమక్షంలో ఈవిఎంల డెటా క్లీయర్ ప్రక్రియను ప్రారంభించామని ఈవిఎంల క్లియర్ చేసే ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగనుందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు,వివిధ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

### 100శాతం మార్కులు సాధించిన విద్యార్థినికి సన్మానం

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త**
ప్రగతి నగర్ జెడ్‌పిహెచ్ఎస్ గవర్నమెంట్ పాఠశాలలో పదవ తరగతి 10/10 మార్కులు సాధించిన ఎం. అక్షరకు సోమవారం శ్రీ పట్టాభి రామాంజనేయ స్వామి ఆలయం ప్రగతి నగర్ తరపున సిహెచ్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ. 10,000 పారితోషకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ జనరల్ సెక్రటరీ ధనరాజ్, జాయింట్ సెక్రటరీ కె.రాములు, కమిటీ సభ్యులు వెంకరెడ్డి, రవీందర్, పాల్గొన్నారు.

## చింతల్ భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలంటూ ఆందోళన

**-బస్తీవాసులు పెద్దఎత్తున మున్సిపల్ కార్యాలయ ముట్టడి**
**-30ఏళ్ల ప్రభుత్వస్థలాన్ని ఎలా కబ్జా చేస్తారు : కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి**



ప్రజావాణిలో గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం సమర్పించి ఆందోళన చేస్తున్న చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి, బస్తీవాసులు

**కుత్బుల్లాపూర్, జూన్ 24 ప్రభాతవార్త**
గత 30 సంవత్సరాలుగా ప్రజాసంక్షేమం కోసం కాపాడుకుంటూ వస్తున్న భగత్‌సింగ్‌నగర్ సర్వేనెంబరు 155 లోని ప్రభుత్వస్థలాన్ని కబ్జాచేసేందుకు చేస్తున్న కుట్రను అడ్డుకుంటామని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి హెచ్చరించారు. ప్రజావాణిలో భాగంగా గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు భారీఎత్తున భగత్‌సింగ్‌నగర్ వాసులతో కలిసి ఆందోళన నిర్వహించి ఉపకమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి మాట్లాడుతూ సుమారు 3,500 గజాల స్థలం ఉండగా ప్రస్తుతం 1100గజాల స్థలం వదిలేసి ప్రాహారీగోడ నిర్మించేందుకు గాజులరామారం సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఉపకమిషనర్ మల్లారెడ్డిని భగత్‌సింగ్‌నగర్ బస్తీవాసులు కార్పొరేటర్ రషీదామహ్మద్‌రఫీతో కలిసి నిలదీశారు. స్థానిక స్థలంలో ప్రభుత్వ ఆసుపత్రి, ప్రజాప్రయోజనాలకు సంబంధించి ఉపయోగానికి స్థలం కాపాడామని ప్రస్తుతం నిర్మిస్తున్న నిర్మాణాలకు సంబంధించి 1994లో మొదటిసారి ప్రభుత్వస్థలంపై సర్వే చేశారని, 1997లో మరోసారి సర్వేచేశారని, 2007లో కలెక్టర్ రఘునందన్ హాయంలో తిరిగి సర్వేనిర్వహించి సర్వేనిర్వహించగా అప్పటికే కొద్దిస్థలం కబ్జా అయ్యిందని తెలిపారు. గ్లాండ్ ఫార్మా పరిశ్రమతో చర్చించి సుమారు రూ.లు.4కోట్ల రూపాయలతో పథకాలు రూపొందించినా ప్రభుత్వం దోబీఘాట్ స్థలం పేరిట వివాదంలో ఉందని ఆపారని తెలిపారు. ప్రజల అవసరాలకోసం ఉపయోగపడాల్సిన స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణానికి సంబంధించి 2016నుండి 2023వరకు ఆందోళన చేస్తున్నామని కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి ఆందోళన వ్యక్తంచేశారు. రాత్రికిరాత్రి ప్రభుత్వ అధికారులు నిర్మిస్తున్న నిర్మాణాలకు సంబంధించి స్థలానికి సంబంధించి ప్రభుత్వ కొలతలు, సర్వే నివేదికలు, ప్రభుత్వ అనుమతి పేపర్లుకానీ లేకుండా సుమారు 1600 గజాల స్థలాన్ని కబ్జాచేసేందుకు యత్నాలు చేస్తున్నారని ఈస్థలం ఎట్టి పరిస్థితిలో ప్రైవేటు వ్యక్తులకు కబ్జాకాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ నగర్ సంక్షేమ సంఘ మాజీ అధ్యక్షులు అల్లాబకాష్, టిఆర్ఎస్ ఉద్యమకారులు సాంభయ్య, చింతల్ అశోక్, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

**-28న సిఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం**
**-లంబాడీహక్కుల పోరాటసమితి, గిరిజన విద్యార్థిసంఘం**


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గణేష్‌నాయక్, వెంకట్ బంజారా, జీవిఎస్ శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో లంబాడీలకు మంత్రిపదవి కేటాయించాలని లేకుంటే ఈనెల 28న రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని నంగారాభేరి లంబాడీ హక్కుల పోరాటసమితి, గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ధరావత్ గణేష్ నాయక్, వెంకట్ బంజారా, జివిఎస్ శ్రీనివాస్‌లు పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఆరునెలలు గడుస్తున్నాలంబాడీలకు క్యాబినేట్‌లో మంత్రి పదవి ఇవ్వకపోవడం బాధాకరన్నారు. జివో 33ప్రకారం గిరిజనులకు ఇచ్చిన 10శాతం రిజర్వేషన్లను కొనసాగించాలని 9వషెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అలాగే గోర్‌బంజారాల ఆరాధ్యదైవమైన సంత్‌శ్రీ సద్గురు సేవాలలాల్ మమరాజ్ జయంతి (ఫిబ్రవరి 15)ని సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అంతేకాకుండా తండాలను ప్రత్యేక రెవెన్యూగ్రామ పంచాయితీలుగా గుర్తించి ఒకొక్క గ్రామ పంచాయితీకి 5కోట్ల నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. 28న జరిగే సిఎం ఇంటి మట్టడి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా గిరిజన నాయకులు విజయవంతంచేయాలని కోరారు. ఈసమావేశంలో ఎల్‌హెచ్‌పిఎస్ మహిళా విభాగం నాయకులు సరోజ, జివిఎస్ మనినాయక్, అచ్చిబాబు, యాదమ్మ, పార్వతి, సుధీర్, మురళి, బన్సిలాల్, దిలీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## చెంచు మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**-ఆల్ఇండియా బంజారా సేవాసంఘం డిమాండ్**

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:**
చెంచు గిరిజన మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆల్ఇండియా బంజారా సేవాసంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షులు మోహన్‌సింగ్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్‌లు పరామర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈశ్వరమ్మకు న్యాయం చేయాలని ఎస్సీఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని అందులో భాగంగా కమిషన్ సభ్యుడితో కలిసి ఆమెను పరామర్శించినట్లు తెలిపారు. అంతరించి పోతున్న చెంచు తెగను కాపాడే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని గిరిజనులపై దాడిని నివారించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డిఆర్‌టి అడ్వకేట్స్ అసోసియేషన్ లైబ్రరీ ప్రారంభం


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రెసిడెంట్ జికె దేశ్‌పాండె, చిత్రంలో జస్టిస్ లక్ష్మీ నారాయణ తదితరులు

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:**
డిఆర్‌టి (డెబిట్స్ రికవరీ ట్రిబ్యూనల్ ) అడ్వకేట్స్ అసోసియేషన్ లైబ్రరీని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ప్రారంభించారు.ఈమేరకు సోమవారం అబిడ్స్‌లోని త్రివేణి కాంప్లెక్స్‌లోని డిఆర్‌టి కోర్టులో డిఆర్‌టి 1 ప్రిసైడింగ్ అధికారి గుమ్మడి గోపిచంద్, డిఆర్‌టి2 ప్రిసైడింగ్ అధికారి రామేశ్వర్ గంగారామ్ కోతే సమక్షంలో అనిల్ కుమార్ మెమోరియల్ లైబ్రరీ, లేడీ అడ్వకేట్స్‌రూమ్‌ను ప్రారంభించి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో జస్టిస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జూనియర్ లాయర్లకు లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ప్రిసైడింగ్ అధికారులు గుమ్మడి గోపిచంద్, రామేశ్వరన గంగారామ్ కోతే, అసోసియేషన్ ప్రెసిడెంట్ జికె దేశ్‌పాండేలు ప్రసంగించారు.

### కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఐఎఫ్‌టియు ధర్నా

**చిక్కడపల్లి, జూన్ 24 ప్రభాతవార్త:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని తెలంగాణ అసెంబ్లీలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముందు భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేసింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా దేశకార్మికవర్గం పోరాం చేస్తుంటే స్పందించాల్సిన కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి ముందుకు రావడం సిగ్గుచేటన్నారు. ఒకవైపు నిత్యావసర వస్తూవుల ధరలు పెరుగుతుంటే ఆదుకోవాలల్సిందిపోయి బాధ్యత నుంచి తప్పుకుని వారిని దోపిడీకి గురిచేస్తున్నారని విమర్శించారు. లేబర్‌కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికుల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందని, కార్మికులు సంఘం పెట్టే హక్కుకోల్పోతారని, సమ్మె చేసే హక్కు ఉండదనానరు. పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌కు అందించారు. ఆందోళన కార్యక్రమంలో ఐఎఫ్‌టియు గ్రేటర్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అరుణ, మల్లన్న, ఉపాధ్యక్షులు మంగ్ల, సహాయ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి కుమార్, నాయకులు సత్యనారాయణ,సరోజ, లీల,మంజు, శ్రీనివాస్ పాల్గొన్నారు


భారత్ సేవ ఆశ్రమ సంఘ్ ఆధ్వర్యంలో పెద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న స్వామి వెంకటేశ్వర నందా

## రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 24, ప్రభాతవార్త**
రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ పేర్కొన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం కూకట్‌పల్లి రైతు బజార్‌లో హర్షం వ్యక్తం చేస్తూ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫి చేస్తానని మేనిఫెస్టోలో పెటన నేపథ్యంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితం మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా రైతులకు రెండు లక్షల రూపాయలు రుణ మాఫీ చేస్తామని తీర్మానం చేశారన్నారు. దీనికి హర్షం వ్యక్తం చేస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి అని అన్నారు. ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి 2లక్షల రుణమాఫి చేయించడం ఇది చరిత్రలో సుస్థిరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తితే ఆదుకునే ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, గాలి బాలాజీ, అరవింద్‌రెడ్డి, అప్పారావు, బాకీ, శివచౌదరి పాల్గొన్నారు

### మేడారం సారాలమ్మ గుంపు ఆదివాసీ గూడెంలో పర్యటించిన ఓ.యూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ

**తార్నాక, జూన్ 24 ప్రభాతవార్త :** సమాజానికి దూరంగా అడవుల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసి చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పుతున్న భీమ్ చిల్డ్రన్ హ్యాపినెస్ సెంటర్‌ను ఓ.యూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ సందర్శించారు. అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతంలో ఉన్న సారలమ్మ గుంపు ఆదివాసీ గూడెంలో ఆయన పర్యటించారు. ఆదివాసీల సంప్రదాయ నృత్యాలతో రిజిస్ట్రార్‌కు ఘనస్వాగతం పలికారు. ఓ.యూలో చదువుకున్న విద్యార్థులు ఇస్రం సంతోష్, నరేష్, శశిందర్ రెడ్డి, గుణమంతరావు ఇతర మిత్రులతో నాలుగేళ్లుగా ఆదివాసి విద్యార్థుల కోసం స్కూల్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ వారికి సమాజం పట్ల ఉన్న భాధ్యతకు నిదర్శనమని అని కొనియాడారు. అనంతరం బిసిహెచ్‌సి నాలుగో వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రొ.లక్ష్మినారాయణ పాల్గొన్నారు. నిర్వాహకులకు వ్యక్తిగతంగా రూ.50వేలను అందజేశారు. చిన్నారులను ప్రోత్సహించి ఉన్నత చదువులు చదివేందుకు ప్రోత్సహిస్తున్న సంతోష్‌తో పాటు ఆయన బృందాన్ని ఈ సందర్భంగా రిజిస్టర్ అభినందించారు. అదేవిదంగా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న టీచర్లకు రిజిస్టార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఓ.యూ పరిశోదక విద్యార్థులు, హాజరయ్యారు.

## ఫ్యాన్‌కు ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

**యూసుఫ్‌గూడ, జూన్ 24, ప్రభాతవార్త :**
మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఎస్. యాదగిరిరెడ్డి, విజయలక్ష్మీల కుటుంబం రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటుంది. ఈనెల 23వ తేదీనాడు భార్యభర్తలు వాకింగ్‌కు వెళ్లి వచ్చారు.పూజా తదితర కార్యక్రమాలను ముగించారు.మధ్యాహ్నం తమ కోడలు కొత్త వాషింగ్ మెషీన్ వచ్చిందని ఫోన్ ద్వారా యాదగిరి రెడ్డికి తెలియజేసింది. దాంతో అతను ఐదో అంతస్థు నుంచి రోడ్డుమీదకు వెళ్ళాడు. అనంతరం దానిని తీసుకుని తిరిగి ఐదో అంతస్థుకు వెళ్ళాడు. ఇంటిముందుకు వచ్చి తన భార్య విజయలక్ష్మీని పిలిచాడు. అయితే ఆమె పలకలేదు. లోపలకు వెళ్ళి చూడగా విజయలక్ష్మీ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. చుట్టుపక్కల వారిని పిలిచి ఆమెను కిందకు దింపాడు. అనంతరం వారు 108కి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి పరిశీలించి ఆమె మృతి చెందినట్టు తెలిపారు. చిన్నతనంలోనే ఆమె తల్లిదండ్రులు మృతిచెందారు. దాంతో అనేక ఒత్తిడిలకు గురవుతూ ఉంది. చిన్న విషయాలకే ఒత్తిడికి లోనయ్యేది. కాగా ఆమె మృతికి కారణాలు తెలియరాలేదు. ఇతర కారణాలు గాని, అనుమానాలుగాని లేవంటూ యాదగిరిరెడ్డి మధురానగర్ పోలీసలకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భూదాన్ భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

**-సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా డిమాండ్**

**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో వందల కోట్ల రూపాయల విలువగల భూదాన్ భూముల అన్యాక్రాంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు సయ్యద్ అజీజ్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు చెందవలసిన భూదాన్ భూములను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన తెలంగాణ సర్వోదయ మండలి 3వ రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. భూమిలేని పేదలకు భూములను పంపిణీ చేసేందుకు స్వాతంత్ర్య సమర యోధుడు ఆచార్య వినోబా భావే తెలంగాణలో భూస్వాముల నుంచి సేకరించిన భూదాన్ భూములను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్లనే వేలాది ఎకరాల భూములు కబ్జాకు గురైనాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తక్షణమే స్పందించి భూదాన్ యజ్ఞబోర్డును పునరుద్దరించి, కబ్జాలకు గురైన భూములను తిరిగి స్వాదీనం చేసుకుని పేదలకు పంపిణి చేయాలని అజీజ్‌పాషా సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సర్వోదయ మండలికి నూతనంగా ఎన్నికైన ఆర్.శంకర్‌నాయక్ మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కోట్లాది రూపాయల విలువగల భూదాన్ భూములను గున్న రాజేందర్‌రెడ్డి అక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ సభలో మండలి రాష్ట్ర నేతలు గిరి ప్రసాద్, మునీరుద్దీన్, షేక్ మహమూద్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


మండలికి నూతనంగా ఎన్నికైన శంకర్‌నాయక్‌ను అభినందిస్తున్న సయ్యద్ అజీజ్‌పాషా

## కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి..

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఏఐటియుసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ చంద్రప్రకాష్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని, గతవారం రోజుల కిందట గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన సంఘటనలు అందరం చూశామని అన్నారు. అలాగే మున్సిపల్‌లో కొంత అవినీతి జరుగుతుందని తమ దృష్టికి వచ్చిందని అన్నారు. వీటితో పాటు వారి సెలవు దినాలపైన చర్చించారు. ఈ సంవత్సరం వర్షాకాలం మొదలైందని కానీ ఇప్పటి వరకు కార్మికులకు, ఉద్యోగులకు ఎలాంటి రెయిన్‌కోట్ ఇవ్వలేదని గుర్తు చేశారు. వెంటనే కార్మికులకు కావాల్సిన రెయిన్‌కోట్, నూనె డబ్బాలు, చెప్పులు, సబ్బులు, గ్లౌజులు, టార్చ్‌లైట్లు తదితర సామాగ్రితో కూడిన కిట్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఏఐటియుసి అధ్యక్షులు ఆశీ యాదయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణంపై చర్యలు ఎప్పుడు : ఆకుల సతీష్

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త**
ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణంపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారు అంటూ సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి నందు ఆకుల సతీష్ అక్రమ నిర్మాణాలపై అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ 134లో మూడు ఎకరాల్లో విస్తరించిన ఎర్రకుంట చెరువు కలదని, ఈ చెరువు నందు కబ్జా చేయడానికి 2020 నుంచే ప్రయత్నాలు చేసిన కొందరికి ప్రస్తుతం ఉనన ఎమ్మార్వో తప్పుడు సర్వే నెంబర్ 49,య 135 చూపిసూనత చెరువు ఎఫ్‌టిఎల్ / బఫర్ జోన్‌లో నిర్మాణాన్ని అనుమతులు ఇచ్చారన్నారు. తరువాత ఫిర్యాదులపై హెచ్ఎండిఏ ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. పూర్తి ఆధారాలతో అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన చర్యలు మాత్రం శూన్యమని, వారం రోజుల్లో చర్యలు తీసుకోకుంటే ఎర్రకుంట చెరువులో టెంటు వేసి ధర్నా చేయడమే కాకుండా మిగిలిన చెరువు భూమిని పేదలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖు అమలేశ్వరి, కార్పొరేషన్ సెక్రటరీ అరుణ్ రావు, ఓబీసీ మచ్చ, ప్రధాన కార్యదర్శి ముఖేష్, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైన్ షాప్ పర్మిట్ రూంను తొలగించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** అంబర్‌పేటలోని రఘునాధ్‌నగర్‌లోగల ఒక వైన్‌షాప్ వల్ల ఆనేక ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం అంబర్‌పేటలో స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్దంగా పర్మిట్ రూం ఏర్పాటు చేయడంతో టేబుల్స్, చైర్స్ వేసి జనతా బార్‌లాగా నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. వైన్ షాపు వల్ల శబ్ధాలు, దూమపాన పోగ, మూత్ర దుర్వాసన వస్తున్నదని, దీంతో పిల్లలు, వృద్దులు, మహిళలు ఇబ్బందులకు, అనారోగ్యానికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే హైదరాబాద్ జిల్లా కలెక్టర్, కాచిగూడ అబ్కారి అధికారులు జోక్యం చేసుకుని పర్మిట్ రూంను మూసివేయాలని వారు డిమాండ్ చేశారు.

## తొలుపునూరి కృష్ణగౌడ్‌ను అభినందించిన విహెచ్


కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తొలుపునూరి కృష్ణగౌడ్‌ను అభినందిస్తున్న హనుమంతరావు

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త**
కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఎల్లప్పుడూ లభిస్తుందని పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు అన్నారు. సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని వి.హనుమంతరావు నివాసంలో ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా తొలుపునూరి కృష్ణగౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా విహెచ్‌కు తన నియామక పత్రం చూపించి, పుష్పగుచ్చం అందించి అభినందనలు అందుకున్నారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీలో అధిక ప్రాధాన్యత లభిస్తుందని, పార్టీ పదవులు పొందిన నేతలు పార్టీ అభివృద్ధికి మరింత పనిచేయాలని కోరారు. తొలుపునూరి కృష్ణగౌడ్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు,ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడి, వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండా ఎగిరే విధంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, లేబర్ బోర్డు మాజీ వైస్‌చైర్మన్ నాగభూ షణం, పార్టీ సీనియర్ నాయకులు గడ్డం లక్ష్మన్, సత్తిబా బు, పంజాల వెంకట్‌గౌడ్, కిషోర్‌కుమార్, దిలీప్ నేత, గడ్డం శశిగౌడ్, నరేష్, విజయ్‌కుమార్, జితేందం నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జగదీశ్వర్‌గౌడ్


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేసిన జగదీశ్వర్‌గౌడ్

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 24, ప్రభాతవార్త**
శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలని వారి నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇలానే అందుబాటులో ఉంటూ, ఆరోగ్యకరమైన జీవితంతో, నీ ప్రతి అడుగు ప్రజలకు మంచి జరిగేలా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని వి.జగదీశ్వర్‌గౌడ్‌కు సూచించారు.

## సుఖమంచి కోటేశ్వరరావుకు కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కారం

**హైదరాబాద్ జూన్ 24, ప్రభాతవార్త :**
జులై 21వ తేది విజయవాడలో ప్రముఖ నాటక దర్శక ప్రయోక్త సినీ రచయిత శ్రీ సుఖమంచి కోటేశ్వరరావుకు '25వ తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక రంగస్థల పురస్కార' ప్రదానోత్సవం జరగనుంది. తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ 25వ వార్షికోత్సవం శ్రీ తంగిరాల చక్రవర్తి షష్టిపూర్తి మహోత్సవం; తంగిరాల కృష్ణప్రసాద్ 90వ జయంతి, 25వ వర్ధంతి పురస్కరించుకొని 25 మంది ప్రముఖులకు సత్కారాలు ఉంటాయి. ఈ సభకు మాజీ ఎం.పి. శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రముఖ కవి నవులూరి రమేష్‌బాబు, చింతా వెంకటేశ్వర్లు, పొత్తూరి సుబ్బారావు, చలపాక ప్రకాష్, తంగిరాల కుటుంబ సభ్యులు, డా॥ పూర్ణచంద్ర రావు, డా॥ కోనా వీరబ్రహ్మం తదితరులు హాజరు కానున్నారు. ఈ సభను ట్రస్ట్ చైర్‌పర్సన్ కెవిఎన్ఎల్ ప్రసన్నకుమారి నిర్వహిస్తున్నారు.

## వచ్చే కేంద్రబడ్జెట్‌లో బిసిలకు రూ.2లక్షల కోట్లు కేటాయించాలి

**-జాతీయ బిసిసంక్షేమసంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య**


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, గుజ్జసత్యం తదితరులు

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:**
వచ్చేకేంద్రబడ్జెట్‌లో బిసిల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజికాభివృద్ధికి రెండులక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని లేకుంటే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈమేరకు సోమవారం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం, కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బిసిల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా అన్యాయం చే స్తుందని అన్నారు. ఈసంవత్సరంకేంద్ర బడ్జెట్‌లో 45లక్షల 90వేలకోట్లు కేటాయిస్తే బిసిలకు 2000 కోట్లు కేటాయిస్తే ఏమూలకు సరిపోతుందని కావున వచ్చేబడ్జెట్‌లోనైనా బిసిలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అందుకు 2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈసం దర్భంగా జాతీయ బిసిసంక్షేమసంఘం దక్షిణ భారతదేశ సెక్రటరీగా సూర్యనారాయణను నియమిస్తూ కృష్ణయ్య ని యామకపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కోలాజనార్థన్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్ నేత, మట్టజయంతి, కె.శివమ్మ, జక్కుల వంశీకృష్ణ, నిఖిల్ పటేల్, పర్వతాలు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని ఆర్డీవోకు వినతి

**బేగంపేట జూన్ 24,ప్రభాతవార్త**
సనత్‌నగర్ నియోజకవర్గం లో గత పది సంవత్సరాలుగా నిర్మాణం పూర్తి అయిన ఇళ్లను కేటాయించకుండా నిర్లక్ష్యంగా వదిలి వేసారని,వెంటనే అర్హులైన వారికి ఇండ్లను మంజూరు చేయాలని ,ఇతర ప్రభుత్వ భూ సమస్యలపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు,సనత్‌నగర్ నియోజకవర్గం బీ జే పీ నాయకులు మర్రి శశిధరరెడ్డి సోమవారం సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్ ను కల్సి వినతిపత్రం అందజేసారు.నియోజకవర్గంలోని కస్తూర్బా నగర్, ఎన్‌బీటీ నగర్, ఓల్డ్‌పాటిగడ్డ,బండమైసమ్మ నగర్,బ్రాహ్మణవాడీ, సీసీ నగర్,న్యూబోయిగూడా,తదితర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యి అర్హులైన పేదవారి సర్వే కూడా జరిగిందని,కానీ పేదవారికి మాత్రం ఇళ్లు కేటాయించకుండా అప్పటి మంత్రి తలసాని జాప్యం చేసారని,వారికి వెంటనే పాత సర్వే ప్రకారం ఇళ్లను కేటాయించాలని వినతి పత్రం అందించారు.దీంతో పాటు బన్సీలాల్‌పేట డివిజన్ నీలం బాలయ్య దొడ్డి ప్రాంతంలో కొందరు తప్పుడు పత్రాలను సృష్టించి ప్రభుత్వ భూమిని వారి భూమిగా పేర్కొంటూ అక్కడ నివాసం ఉండే వారిని ఖాళీ చేయించే ప్రయత్నంతో పాటు ఆ స్థలాన్ని కబ్జా చేయాలనుకునే ప్రయత్నాన్ని తాను అడ్డుకొని న్యాయ పోరాటం చేసి అది ప్రభుత్వ స్థలం అని నిరూపించి అక్కడ ప్రభుత్వ స్థలం అంటూ బోర్డు ఏర్పాటు చేయించామని వివరించారు.ప్రస్తుతం కొందరు అధికార పార్టీకి చెందిన వారు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని,ఆర్డీవోకు మర్రి వివరించారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సిడిపిఓ సరిత

## మూడు రోజుల పాటు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

**గజ్వేల్, జూన్ 24 (ప్రభాతవార్త):** ఐసిడిఎస్ గజ్వేల్ ప్రాజెక్టు నందు సోమవారం మూడు రోజుల పాటు అంగన్వాడీ టీచర్లకు నూతన జాతీయ విద్యావిధానంలో పొందుపర్చిన అంశం పిల్లల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా రూపొందించిన పాఠ్య ప్రణాళికపై అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గజ్వేల్ సిడిపిఓ సరిత ప్రారంభించారు. ప్రాజెక్టు పరిధిలో 274 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా 35 కేంద్రాల టీచర్లకు జిల్లా కేంద్రంలో శిక్షణ తీసుకున్నారు. మిగతా 239 ఉపాధ్యాయులను 6 బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో పూర్తిస్థాయి పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా మారుస్తున్నామని, నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి వరకు అంగన్వాడీ కేంద్రాలలో విద్యను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల పర్యవేక్షకులు పోషణ్ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## నాచగిరి క్షేత్రానికి 28 గుంటల భూమి విరాళం



నాచగిరి ఈఓకు 28 గుంటల పట్టా పాస్ పుస్తకం అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, జూన్ 24 (ప్రభాతవార్త):** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంకు హైదరాబాద్‌కు చెందిన కృష్ణ చంద్రశర్మ, రఘువీర్‌శర్మ, నందకిషోర్‌శర్మలు 28గుంటల భూమిని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు త్రిగుల్ల చంద్రశేఖరశర్మ, అరుణల జ్ఞాపకార్థం హీరాబాయమ్మ తోటలో వారికి చెందిన సర్వే నెం. 360లోగల 28 గుంటల భూమిని నాచగిరి దేవస్థానం పేరుపై రిజిస్ట్రేషన్ చేయించి అట్టి పట్టా పాస్ పుస్తకాన్ని అందజేయడం జరిగిందని తెలిపారు. అలాగే కీర్తిశేషులు త్రిగుల్ల పద్మనాభశర్మ కుమారుడు త్రిగుల్ల గోపాలకృష్ణశర్మ, విద్యాసాగర్‌శర్మలు హీరాబాయమ్మ తోటలో వారికి సంబంధించిన 54 చదరపు గజముల ఆర్‌సిసి భవనంను ఆలయ అర్చకులకు గానూ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానము నుండి స్వామివారి పల్లకిసేవ ఊరేగింపుగా హీరాబాయమ్మ తోటలో శంకరమఠము నందు విరాళముగా ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో దేవస్థాన ముఖ్య అర్చకులు జగన్నాథ చార్యులు, వేదపండితులు నాగబాల కామేశ్వరశర్మ, అర్చకులు హరిప్రసాద్ శర్మ, రమేష్‌శర్మ, విద్యాసాగర్‌శర్మ, గోపాలకృష్ణశర్మ, నాగరాజుశర్మ, రామకృష్ణశర్మ, సిబ్బంది సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ నరేందర్ పాల్గొన్నారు.

## వేదాలే మానవ మనుగడకు మూలాలు

**-ఆలయ కమిటీ సభ్యుడు యాయవరం రాజశేఖరశర్మ**



వేద విద్యాలయంలో చేరిన నూతన విద్యార్థులు

**వర్గల్, జూన్ 24 (ప్రభాతవార్త):** వేదాలు మానవ మనుగడకు మూలాలని, దానిని దృష్టిలో పెట్టుకొని ప్రతిక్షణం వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రం కృషి చేస్తుందని ఆలయ కమిటీ సభ్యులు, బ్రహ్మశ్రీ యాయవరం రాజశేఖరశర్మ పేర్కొన్నారు. క్షేత్రానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీ శారదా స్మార్త వేద విద్యాలయంలో 22 మంది విద్యార్థులకు ఆదివారం ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించే క్రమంలో నిష్ణాతులైన ఆచార్యులు సకల వసతులతో కూడిన వేద విద్యాలయాన్ని ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలుగా వేద విద్యను పంచుతున్నట్లు తెలిపారు. కాగా 22 మంది విద్యార్థుల చేరికతో ఆ సంఖ్య ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న వారి సంఖ్య 93కు చేరిందని, ఇప్పటికే వేలాది మంది వేద విద్యార్థులను తీర్చిదిద్ది ధార్మిక స్థాపనకు, సమాజానికి అందించినట్లు స్పష్టం చేశారు. వర్గల్ వేద విద్యాలయం రాష్ట్రంలోనే చక్కటి ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలవాలన్నదే క్షేత్ర వ్యవస్థాపకులు, వాస్తు సిద్ధాంతి, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందుకు అనుగుణంగా ఆలయ కమిటీ సభ్యులు సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం

## నూతన అధ్యక్షుడిగా కాయిత బాల్‌రెడ్డి



నూతన పాలకర్గం దృశ్యం

**హుస్నాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నూతన అధ్యక్షునిగా హుస్నాబాద్‌కు చెందిన కాయిత బాల్‌రెడ్డి 3వ సారి ఎన్నికయ్యారు. సోమవారం సంఘం డైరెక్టర్ల పదవి కాలం ముగియడంతో డైరెక్టర్ల పదవికి సంఘం ఎన్నికలు నిర్వహించారు. జరిగిన ఎన్నికలో నూతన డైరెక్టర్లుగా గొర్ల సాంబరాజు, గుంబం రవీందర్ గెలుపొందారు. మొత్తం 9 మంది డైరెక్టర్లు కలసి నూతన అధ్యక్షుడిగా బాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన అధ్యక్షులు, డైరెక్టర్లకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. అనంతరం నూతన అధ్యక్షులు బాల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్నరోజుల్లో సంఘం లాభ,నష్టాలు,సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి సమస్యలు పరిష్కరించేందుకు సహకరిస్తానన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ.. ఒకరు మృతి

**కోహెడ, జూన్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని శనిగరం రాజీవ్ రహదారిపై ఆగిఉన్న లారీకి మరొక లారీ వచ్చి ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. ఎస్ఐ సిహెచ్ తిరుపతి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.టిఎస్36 టి4522 లారీలో సిమెంట్ లోడుతో దేవాపూర్ నుంచి చేగుంటకు వెళ్తుందని తెలిపారు. మార్గ మధ్యలో శనిగరం రాజీవ్ రహదారిపై లారీటైరు పగలడంతో డ్రైవర్ విజయ్‌కుమార్ టైర్ మార్చడానికి కిందికి దిగినట్లు తెలిపారు. టైర్ మార్చుతుండగా వెనుక నుంచి వచ్చిన మరొక లారీ ఏపీ 39యువి5769 నిర్లక్ష్యంగా అతివేగంగా నడుపుకుంటూ వచ్చి అగి ఉన్న లారీని వెనుక ఢీ కొనడంతో టైర్ మార్చుతున్న విజయ్ కుమార్ (38) లారీ కిందికి దూసుకువెళ్లడంతో దాని కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయండి

### ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకుల పిలుపు




మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**మెదక్ మున్సిపాలిటీ, జూన్ 24 ప్రభాతవార్త:** జూలై 7న వరంగల్‌లో జరిగే 30 ఏళ్ల మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకుల పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అస్తరుగళ్ల బాలరాజ్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మలిశెట్టి రవిలు హాజరై మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు షెడ్యూల్ కులాలలోని అన్ని ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారంగా పంపిణీ జరగాలని అస్తిత్వ ఆత్మగౌరవ పోరాటాలకు పురుడు బోసిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించి జూలై 7 నాటికి గౌరవ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏర్పడి నేటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. ప్రపంచంలో ఇంత ఘన చరిత్ర కలిగిన ఉద్యమం దండోరా ఉద్యమం అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆవిర్భవించిన నాటి నుండి కేవలం మాదిగల కోసమే కాకుండా సమాజంలో అన్ని అణగారిన పీడిత వర్గాలు, ఇతర కులాల ప్రజా సమస్యల మీద ఎన్నో సామాజిక పోరాటాలు చేసిందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతు పెన్షన్ల పెంపు కోసం, గుండె జబ్బు చిన్నారుల కోసం ఉచిత వైద్యం కోసం చేసిన పోరాటనే ఆరోగ్యశ్రీ కార్డు రూపకల్పనకు దారి తీసిందని తెలిపారు. ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటమే సమాజంలో అన్ని వర్గాలకు మేలు కలిగించిందని తెలిపారు. తమ లక్ష్య సాధనైనా ఎస్సీ వర్గీకరణకు అతి త్వరలోనే నూతనంగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్డీఏ ప్రభుత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జూలై 7 నాటికి ఎమ్మార్పీఎస్ శ్రేణులు గ్రామ, మండల పూర్తిస్థాయి కమిటీల చేసుకుని నల్ల షర్ట్, పాయింట్ డ్రెస్ కోడ్‌తో జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు లక్షలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట మండల ఇన్‌ఛార్జి ఎరువుల పరమేష్ మాదిగను నిర్మించడం జరిగిందని అన్నారు. ఇతర డివిజన్ మండలాల ఇన్‌ఛార్జిలను ఎమ్మార్పీఎస్ నూతన జిల్లా నాయకత్వం ప్రకటించి తీర్మాణం చేయడం జరిగింది. ఈ మహాసభను విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా మాదిగలు పల్లెల నుండి రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామం నుండి ప్రతి మాదిగ బిడ్డ వరంగల్ జిల్లా కేంద్రానికి తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మస్కూరి వెంకటి, కొమ్ముల శేఖులు, దంబాల శంకర్, దొండోల సామిల్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్, కోకన్వీనర్‌లు రాజు, కిరణ్, మాదిగ, మహిళా సమైఖ్య జిల్లా అధ్యక్షులు మాధవి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలకు దాతల సహకారం అవసరం

**కీసర,జూన్24,ప్రభాతవార్త:** దేవాలయాలకు దాతల సహకారం ఎంతైనా అవసరమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నా రు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీ రోడ్డు నెంబర్ 3లోగల శ్రీపోచమ్మ దేవస్థానం కమాన్ నిర్మించడానికి భూ మి పూజ చేయడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. దేవాలయాలను అభివృద్ధిచేయడానికి దాతల సహాయ సహకారాలు అవసరమన్నారు. అనంతరం చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్‌లను కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నం రాజు సుమిత్ర సురేష్,దేవస్థాన కమిటీ అధ్యక్షులు హరగోపాల్, సభ్యులు రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఉమశంకర్, రంగారా వు, చంద్రశేఖర్, బిక్షపతి,నారాయణ, కాలనీ అధ్యక్షులు అశోక్ యాదవ్, రమేష్, నాగరాజు, మురళి, సుమంత్, పాల్గొన్నారు.

## రామలింగేశ్వరునికి పల్లకి సేవ

**కీసర, జూన్ 24,ప్రభాతవార్త :** కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ,ఈఓ సుధాకర్ రెడ్డిలు కలిసి స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించడం జరి గింది. నగరం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నా రు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన పాటు కాలువను కాపాడండి

**కొత్తూర్, జూన్ 24, ప్రభాతవార్త :** కొత్తూర్ మున్సిపాలిటీలోని గణపతి కాలనీ పక్కనే ఉన్న పాటు కాలువను కొందరు కబ్జా చేశారని, పాటు కాలువను పరిరక్షించాలని కోరుతూ సోమవారం కొత్తూర్ మున్సి పల్ భవనంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి, కొత్తూర్ మున్సిపల్ కమిషనర్‌కు యువ నాయకుడు శివచారి కాలనీవాసులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కొత్తూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో సర్వే నెం.19,20లలో డీటీసీపీ అప్రూవల్ లేఅవుట్ ఏర్పాటు చేశారు. లేఅవుట్ ఏర్పాటు చేసి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని గణపతి నగర్ కాలనీవాసులు ఆవేధన వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారు లకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని తెలిపారు. పాటు కాలువ కబ్జాకు గురికావడంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో వర్షపు నీరు ఆ పాటు కాలువ ద్వారా కాశన్నకుంట చెరువులోకి వెళ్లకుండా ఇళ్ల మధ్యకు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈవిషయమై స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో టి.రవి, రంజిత్, సాగర్, అనిల్, రాఘవేందర్‌యా దవ్, గ్రామ యువకులు తదితరులు ఉన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**తలకొండపల్లి, జూన్ 24, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ రెండు లక్షల రుణమాఫీ చేయాలని తీర్మాణం చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం ప్రభా కర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని చరిత్రలో ఏకకాలంలో రుణమాఫీ నిలిచిపోతుందని మాటల్లో చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ రెడ్డి భగవాన్‌రెడ్డి దేవిడ్ డిగ్రీ కృష్ణ రవీందర్ యాదవ్ అజీమ్ ఆరీఫ్ కేశవరెడ్డి అంబాజీ అజీమ్ కృష్ణ కృష్ణారెడ్డి శ్రీశైలం ప్రదీప్‌రెడ్డి శేఖర్ వివిధ గ్రామాల నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కడ్తాల్‌లో సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**కడ్తాల్, జూన్ 24 ప్రభాతవార్త :** కడ్తాల్ పట్టణ కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి సభ్యుడు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులందరికి 31 వేల కోట్ల రూపాయలు మంజూరు చేసిందని ఆయన అన్నారు. రాబోయే రోజులలో బడుగు, బలహీన వర్గాలకు, రైతులకు మేలు చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని శ్రీని వాస్‌గౌడ్ అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్న శుభ సందర్భంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినట్లు ఆయన తెలిపా రు. కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, డిసిసి కార్యదర్శి బిక్యానా యక్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిచ్చునాయక్, కో ఆప్షన్ సభ్యులు జాంగిర్‌బాబా, నాయకులు చేగూరు వెంకటేష్, గూడూరు భాస్కర్ రెడ్డి, జాంగిర్‌బాబా, అశోక్, శంకర్, శేఖర్‌గౌడ్, జోహార్‌లాల్, హీరాసింగ్, రామచంద్రనాయక్,మాల మల్లేష్‌గౌడ్, ఇమ్రాన్‌బాబా, లక్పతినాయక్, రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్, పలకల పంపిణీ

**శంషాబాద్,జూన్ 24, ప్రభాతవార్త** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇందిరా నగర్, ఊట్పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి విద్యార్థులకు శంషాబాద్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ బిసి సెల్ వైస్ ప్రెసిడెంట్ కావలి సతీష్ నోట్ బుక్స్ పలకలు పంపిణీ చేశారు. వార్షిక సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఊట్పల్లి ఇందిరానగర్ బస్తీలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించేందుకుగాను తన వంతు సహాయంగా పలకలు నోట్ బుక్స్‌ను ఉచితంగా అందజేసినట్లు సతీష్ తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. కేసీఆర్ హయాంలో ప్రవేశపె ట్టిన సన్నబియ్యం పథకం కొనసాగుతుందని చిన్నారి విద్యార్థులకు ప్రభుత్వ పరంగా ఎంతో ప్రోత్సా హాన్ని అందిస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సతీష్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయ కులు బోడంపాటి మహేష్ విద్యాకమిటీ చైర్మన్ కావలి రాము గొల్ల పల్లి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆమనగల్లులో డిప్యూటీ సిఎం సందడి

**ఆమనగల్లు, జూన్24, ప్రభాతవార్త:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాసేపు సందడి చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్హాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన ఓ బాధిత చెంచు కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆయన ఆమనగల్లు మీదుగా వెళుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికేందుకు రాజీవ్ చౌరస్తా వద్దకు భారీగా చేరుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తెల్లమల్ల జగన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భట్టి క్వాన్వాయ్ ఎదురేగి స్వాగతం పలికారు. ఈమేరకు డిప్యూటీ సీఎం క్వాన్వాయ్ వాహనం దిగి పార్టీ శ్రేణులను కలుసుకున్నారు. పార్టీ కండువా కప్పి శాలువతో సత్కరించారు. పార్టీకి, ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రికి అనుకూలంగా నినాదాలు చేసి సందడి చేశారు.

## ఓంకారేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**యాచారం జూన్24,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని ఓంకారేశ్వర స్వామి దేవస్థానం నందివనపర్తి జ్యేష్ట శుద్ధ తదియ సోమవారం పార్వతి సమేత శ్రీ ఓంకారేశ్వర స్వామి,శ్రీ సీతా సమేత శ్రీ కోదండరామస్వామి,సమేత గురు దత్తాత్రేయ స్వామి బ్రహ్మ విష్ణు మహేశ్వర లీలా కళ్యాణ మహోత్సవం ఒకేచోట ఒకే సమయానికి నిర్వహించారు. నందివనపర్తి గ్రామంలో ఏరువాక పూర్ణిమ తదుపరి నందీశ్వరుని ప్రీతికరమైన రోజున ముల్లోకాల నుంచి వచ్చి కళ్యాణ మహోత్సవానికి గ్రామ ప్రజలు విచ్చేసి తిలకించారు.ఈ కార్యక్రమంలో దాతలు కొండూరు రామనాథం గుప్తా,సుధారాణి దంపతలు సమేత గురు దత్తాత్రేయ స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ కార్యక్రమం ప్రత్యేక అభిషేకాలు తదుపరి ఓంకారేశ్వర కోదండ రామస్వామి గురు దత్తాత్రేయ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ పెద్దలు వన్నవాడ మల్లారెడ్డి,దశరథ ,కాలే యాదయ్య, నందీశ్వరస్వామి,ఆలయ పూజారి సిద్ధేశ్వర, మాజీ సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్,సత్తు మోహన్ రెడ్డి, గ్రామపెద్దల సమక్షంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ పప్పు వెంకట శివ కుమార్,ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## మొయినాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**మొయినాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండల కేంద్రంలోని ఫెర్వ్యూమెథొడిస్ట్ చర్చ్ ప్రాంగణంలో రేవరెండ్ పి విజయరావు డిఎస్ అధ్య క్షతన ఉచిత వైద్య శిబిరాన్ని ఇండి యా మెడియల్ మిషన్స్ యూఎస్ఏ మరి యు యూనికార్ప్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమ వారం ఉదయం 10 గంటలనుంచి 4 గంటల వరకు నిర్వ హిచారు. మొయి నాబాద్ మండలంతోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి రోగులకు వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగినటువంటి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దీర్ఘకాలిక సంబంధించినటువంటి రోగాల కొరకు సీనియర్ వైద్యులతో సంప్రదింపులు జరిపారు. రోగులకు ఉచితంగా రక్తప రీక్షలు, ఈసిజీ కంటి పరీక్షలు, అద్దాలు ఉచితంగా అందించారు.ఈ శిబిరంలో 250మందికిపైగా రోగులు ప్రయోజనం పొందారు. ఈకార్యక్రమంలో మొయి నాబాద్ మెథొడిస్ట్ సంఘం పెద్దలు జిల్లా ఎంవైఎఫ్ యూత్ వివిధ గ్రామాల యువకులు తదితరులు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారని తెలిపారు.

# ప్రమాదవశాత్తు లారీ దగ్ధం

**తాండూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు ఓ లారీ దగ్ధమైంది. విద్యుత్ స్తంభంపై ఏర్పడిన కరెంటు మెరుగులతో విద్యుత్ వైర్లు కాలిపోయి ఆగిఉన్న లారీకి మంటలు అంటుకొని కాలిబూడిదైపోయింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. ఇందకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణానికి చెందిన మహ్మద్ జావిద్ లారీ ఏపీ22 డబ్ల్యూ1038ను ఆదివారం రాత్రి అంతారం రోడ్డు మార్గంలోని వైట్ ప్యాలెస్ సమీపంలో పార్కింగ్ చేసి ఉంచారు. సుమారు 11గంటల సమయంలో లారీకి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభంపై అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ క్రమంలో కాలుతున్న విద్యుత్ వైర్లు తెగి లారీ మీద పడటంతో పడ్డాయి. దీంతో లారీ మొత్తం మంటలు వ్యాపించడంతో మంటల్లో లారీ క్యాబిన్ పూర్తిగా కాలిపోయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అధికారులు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.8లక్షల వరకు నష్టం జరిగిందని లారీ యజమా ని జావిద్ వాపోయాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నష్టపరి హారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆర్టీసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**తాండూరు, జూన్ 24, ప్రభాతవార్త :** ఆర్టీసి బస్సు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన సోమవారం తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూ రు పట్టణం గ్రీన్ సిటీ కాలనీకి చెందిన వినోద్‌కుమార్(42) కిరాణ షాపుతోపాటు పాలిషింగ్ యూనిట్లు కొనసాగిస్తున్నారు. సోమవారం సాయంత్రం లక్ష్మీనారాయణపూర్ రోడ్డు నుండి బైక్‌పై తాండూరు పట్టణం వైపు వస్తుండగా ఎస్వీఆర్‌గార్డెన్ సమీపంలో తాండూరు నుండి కోడంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసి బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వినోద్‌కుమార్ తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే వినోద్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## బిజెవైఎం శంషాబాద్ ఉపాధ్యక్షుడిగా దమ్మాయిగూడ వీరేందర్‌రెడ్డి

**శంషాబాద్,జూన్ 24, ప్రభాతవార్త** భారతీయ జనతా యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా శంషాబాద్ పట్టణానికి చెందిన దమ్మాయిగూడ వీరేందర్‌రెడ్డిని నియమించారు. బిజెవైఎం శంషాబాద్ మున్సిపల్ ఉపాధ్యక్షుడిగా వీరేందర్‌రెడ్డిని శంషాబాద్ మున్సిపల్ బిజెవైఎం అధ్యక్షుడు వంశీ యాదవ్‌ను నియమించారు. సోమవారం నియామకపత్రాన్ని ఆయన అందజేశారు. ఈ కార్య క్రమంలో బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు దేవేందర్ బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అసెంబ్లీ కన్వీనర్ సిద్దు మున్సిపల్‌ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు బిజెవైఎం యువ నాయకులు రాహుల్ గాజుల శ్రీకాంత్ సాయి ప్రకాష్ పాల్గొన్నారు.

## ఘనంగా బొండ్రాయి మూడవ వార్షికోత్సవం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 24, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో బొండ్రాయి(నాభిశిల) మూడవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బొండ్రాయి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బైండ్ల పూజారుల మంత్రోచ్ఛారణలతో గావు, బలిగంప ఊరేగింపు, చంద్రపటం, నాభిశిలాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు గ్రామ పెద్దల సమక్షంలో పెద్ద ఎత్తున జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, నల్లవెల్లి లక్ష్మీశేఖర్ ముదిరాజ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, బాలగోని వెం కటేశ్ గౌడ్, పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కేఎం. రెడ్డి, ఉపాధ్యక్షుడు పోల గోని వెంకటస్వామి గౌడ్, డైరుక్టర్లు నానావత్ జితేందర్ నాయక్, రాధారపు యాదగిరి, దర్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, అల్వాల దర్శన్ గౌడ్, నాయకులు కొంతం శంకర్ రెడ్డి, ఎన్. రమేశ్, బోయపల్లి సత్తిరెడ్డి, నానావత్ బిక్కునాయక్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన ద్వారం వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతలు

## గుంతను తవ్వారు.. పూడ్చడం మరిచారు

**చిన్నశంకరంపేట,జూన్ 24,ప్రభాతవార్త:** ఫైబర్ కనెక్షన్ కోసం గుంతను తవ్వారు, కానీ చాలా రోజులైన ఆ గుంతను పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రం ప్రధాన ద్వారం పక్కనే ఫైబర్ కేబుల్ వేయడానికి కాంట్రాక్టర్ పెద్ద పెద్ద గుంతలను తీశారు. మండల కార్యాలయాలకు నిత్యం అధికారులు, ప్రజలు వస్తూంటారు. ద్వారం పక్కనే గుంతలు ఉండటంతో, వర్షాకాలం కూడ అవటంతో ప్రజలు అందులో పడే అవకాశం ఉంది. నిత్యం మండలానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ అధికారులు ఇక్కడి నుండే వెళ్తుంటారు తప్ప ఈ గుంత సమస్యను పట్టించుకునే వారు లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైన అందులో పడి ఎదైన జరిగితే ఎవరు భాద్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రహరిని ఆనుకొని మరొక గుంతను నెల రోజుల క్రితం తీశారు. వర్షం కురవడంతో గుంతలోకి నీరు చేరి ప్రహరీ గోడ కుంగిపోయే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

**గజ్వేల్ టౌన్, జూన్ 24 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి గ్రామానికి చెందిన కిచ్చుగారి రమేష్ ఆత్మహత్య చేసుకొని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, స్థానిక కౌన్సిలర్ బబ్బూరి రజితగౌడ్, కూరాకుల శ్రీనివాస్, నాయకులు బీరయ్య, మల్లేశం, పోచయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

## నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

**ఆమనగల్లు, జూన్24, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో ఆగిపోయిన బదిలీలు, పదోన్నతలపై ఆమనగల్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశా ల్లో ఉపాధ్యాయునీలు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేప ట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో బదిలీలు, పదోన్నతులు సజావుగా జరిగిపో యాయని, ఒక్క రంగారెడ్డి జిల్లాలో ఉన్నఫలంగా నిలిపివేయ డం అన్యాయమని వారు తెలిపారు. ఇప్పటికే పదోన్నతులు, బదిలీలపై వెళ్ళిన వారి ఖాళీలను భర్తీ చేయడంలో ఈ నిలుపుదల విద్యార్థులకు తీరని నష్టానికి గురి చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం సానుకూలంగా స్పందించి రంగారెడ్డి జిల్లాలో బదిలీలు, పదోన్న తులు చేపట్టాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బదిలీలు, పదోన్నతులపై నిరసన తెలిపిన ఉపాధ్యాయులు

**కొత్తూర్, జూన్ 24, ప్రభాతవార్త :** బదిలీలు పదోన్నతులపై ప్రభుత్వం వెంటనే ఈ షెడ్యూల్‌లోనే జరపాలని ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం తెలిపారు. కొత్తూర్ పురపాలికలోని మండల పరిషత్ స్కూల్‌లో రం గారెడ్డి జిల్లా ఉపాధ్యాయ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు కొత్తూర్ మండ లంలోని ఉపాధ్యాయులు పదోన్నతులు బదిలీలు వెంటనే ఈ షెడ్యూల్‌లోనే జరపాలని తెలియజేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి భోజనం విరామ సమయంలో నిరసనను వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో బదిలీలు పదోన్నతులు జరగకపోవడం వల్ల ఉపాధ్యాయులు సీనియర్టీ లో వెనుకబడిపోతారని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ షెడ్యూల్‌లోనే రంగారెడ్డి జిల్లాలో కూడా ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు జరపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కొత్తూర్, నందిగామ పీఆర్టీయూ అధ్యక్షప్రధానకార్యదర్శులు ఎం.విజయ సాగర్, రాఘవేందర్, ఆంజనేయులు, ప్రభాస్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

**కొత్తూర్, జూన్ 24, ప్రభాతవార్త :** కొత్తూర్ అండర్‌పాస్ రోడ్డు సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల సాంకేతిక లోపాలుమూలంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కొత్తూర్ పురపాలికలో వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అండర్‌పాస్ రోడ్డును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేషనల్ అథారిటీ అధికారులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కొత్తూర్ వై జంక్షన్ నుండి వినాయక స్టిల్ కంపెనీ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని అధికారుల కు ఆదేశించారు. ఈవిషయంపై అధికారులతో చర్చించడానికి వెంటనే ఏర్పాటు చేయాలని అక్కడికి వచ్చిన అధికారులకు ఆదేశించారు. వీలైనం త త్వరలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నేషన ల్ ఆథారిటీ అధికారులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ఏఈ భానుశర్మ, ప్రాజెక్టు మేనేజర్ ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, జై.గోవర్ధన్‌గౌడ్, మాజీ సర్పంచ్ జగన్, ఇందారి శ్రీనివాస్, మామిడి సిద్దార్థరెడ్డి, చిలకమ్రి నరసింహ, సత్త య్య, ఆంజనేయులుగౌడ్, జె.జగన్‌గౌడ్, రామకృష్ణ, టి.రమేష్, గోవింద్‌నాయక్, హసన్, నరసింహముదిరాజ్, నాయకులు ఉన్నారు.

## కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

**తాండూరు, జూన్ 24, ప్రభాతవార్త :** కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించడం జరిగిందని తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సాయిపూర్‌కు చెందిన మిస్కిన్ దేవరాజ్‌ను పట్టణంలోని దన్‌గర్‌గల్లికి చెందిన కురువ మహేష్ మాట్లాడుకుందామని చెప్పి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్దకు పిలిపించి కొబ్బరిబొండాం కత్తితో దాడిచేసిన విషయమై .. బాధితుడు దేవరాజ్ తండ్రి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయడం జరిగిందని, సోమవారం మహేష్‌ను ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని గౌరవ న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జ్యూడీషి యల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందని సీఐ వెల్లడించారు.

## మృతి చెందిన వ్యక్తికి రీ పోస్టుమార్టం

### మృతదేహాన్ని వెలికి తీసి అస్తికలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిన ఎస్సై

**దౌల్తాబాద్, జూన్ 24,ప్రభాతవార్త;** మృతి చెందిన వ్యక్తికి రీపోస్టుమార్టం నిర్వహించిన సంఘటన సోమవారం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని బిచ్చల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రావిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 12న ఈడిగి కొరిడే అశోక్ గౌడ్(35) మృతి చెందగా అదేరోజు సాయంత్రం అశోక్‌గౌడ్ మృతదేహాన్ని బిచ్చాల్ గ్రామానికి చెందిన అశోక్‌గౌడ్ మృతి పట్ల పలు అనుమా నాలు వ్యక్తం చేస్తూ మృతుడి సోదరులు నర్సింలు గౌడ్ ఈ నెల 18న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు బిచ్చల్ గ్రామానికి వెళ్లి అక్కడ పూడ్చిపెట్టిన అశోక్‌గౌడ్ మృతదేహాన్ని గ్రామస్తుల సాయంతో రీ పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వెలికితీయడం జరిగింది. అనంతరం శవ పంచనామా నిర్వహించడం జరిగిందని, పంచనామా రిపోర్టు ఆధారంగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ తెలిపారు. ఫోరెన్సిక్ రిపోర్టు ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

**యాచారం జూన్24,ప్రభాతవార్త :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఇబ్రహీం పట్నం డివిజన్ ఆధ్వర్యంలో యాచారంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలకు ఎలాంటి పర్మిషన్ లేకుండా నడిపిస్తున్నారని ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్ మాట్లాడుతూ... ఎలాంటి పర్మిషల్ లేకుండా విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేసి అడ్మిషన్ తీసుకున్న శ్రీచైతన్య యాజమాన్యంపైన క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఇబ్రహీం పట్నం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ,తరంగ్,ఇబ్రహీం పట్నం డివిజన్ ఉపాధ్యక్షులు విప్లవ్‌కుమార్, శ్రీకాంత్,జిల్లా కమిటీ సభ్యులు లిఖిత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాకేష్,శి వ, నిఖిల్, శివ, పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పోరేటర్ పుష్పనగేష్

## సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**రామచంద్రాపురం, జూన్ 24, ప్రభాతవార్త:** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్‌లో రూ.40లక్షలతో నిర్మించే సిసి రోడ్డుపనులకు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ సోమవారం భూమి పూజ నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. సండే మార్కెట్‌లో నీరు ఆగకుండా ఫైన్ లైన్ వేయాలని, నూతన సిసి రోడ్డులో ఉన్న మ్యాన్ హోల్‌లో కలపాలని కాంట్రాక్టర్‌కు కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, ఏఈ నరసభ, నాయకులు తొంట నర్సింహా, సత్యనారాయణ, నాగరాజు, ఒగ్గు మాణిక్యం,మల్లేష్, మల్లికార్జున్, వసీమ్, బైకాన్ సాయిలు, బైకాన్ నవీన్, రవి, భూషణం, బిట్టు పాల్గొన్నారు.

## బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధూ



బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 24, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజికాలనీ, విద్యుత్‌నగర్ కాలనీల్లో సోమవారం జలమండలి, బల్దియా ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఐజి కాలనీలో రూ. 51లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ సమయంలో నీటి పైపులైన్, డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లకు నష్టం వాటిల్లకుండా చూడాలి సూచించారు. ఫ్లోప్స్ చెక్ చేసుకుని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. విద్యుత్ నగర్ కాలనీలో తెల్లాపూర్ మున్సిపాలిటీ వారు నిర్మిస్తున్న డ్రైనేజీ లైన్‌తో అన్నమయ్య ఎన్క్లేవ్ కాలనీ దగ్గర ఓపెన్ సెవరేజ్ సమస్య ఏర్పడుతుందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్స్‌పెక్టర్ అక్రం, జలమండలి ఏఈ జనార్ధన్, ఎల్ఐజి కాలనీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్ శ్యాముల్ జాన్, రాజలింగం, మహిళా సర్కిల్ సెక్రటరీ సరిత, సత్యవతి, అన్నమయ్య ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షులు ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులు కిషోర్, బిఆర్ఎస్ నాయకులు పాటి సత్యనారాయణ, యాదిరెడ్డి, యూసఫ్, జావిద్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## దండోరా రజతోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



దండోరా రజతోత్స వాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్‌నేతలు

**కొల్చారం, జూన్ 24 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామం మెదక్-సంగారెడ్డి ప్రధాన రహదారి పక్కన బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద దండోరా రజతోత్స వాల కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే దండోరా రజోత్స వాలకు మాదిగ ఉప కులాలు, మేధావులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, మహిళలు, కళాకారులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ ఎన్నికల్లో కూడా ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, కాబట్టి వర్గీకరణ అతి తొందరలో చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తూ త్వరలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్యాదర్శి ఎర్రోళ్ల సంజీవయ్య మాదిగ, పుర్ర మహేష్‌మాదిగ, బాలరాజుమాదిగ, రాజుమాదిగ, దేవయ్య మాదిగ, గిరిమాదిగ, జానుమాదిగ, ఇమ్ము, ఎమ్మార్పీఎస్‌నాయకులు ఉన్నారు.

## మాసాయిపేట నూతన ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

**వెల్దుర్తి, జూన్ 24 ప్రభాతవార్త:** మాసాయిపేట మండల నూతన ఎమ్మార్పీఎస్ కమిటీని సోమవారం మండలపరిధిలోని హల్దీవాగు ప్రాంతంలో సమావేశం నిర్వహించి ఎన్నుకోవడం జరిగిందని ఎమ్మార్పీఎస్ నాయకులు మాసాయిపేట యాదగిరిమాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుల మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదేశాల మేరకు మాసాయిపేట గ్రామ నూతన ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా బొడ్డు నరేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా స్టేషన్ శరత్, ప్రచార కార్యదర్శిగా శివశంకర్ మాదిగ, కోశాధికారిగా శ్రీకాంత్, సలహాదారులుగా సాయికుమార్, రాకేష్‌లను ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. అలాగే మాసాయిపేట మండల ఇన్‌ఛార్జిగా విశాల్ మాదిగను ఎన్నుకోవడం జరిగిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శేఖులు మాదిగ, మాదిగ విద్యార్థి సమాఖ్య జిల్లా అధికార ప్రతినిధి ముక్క వినోద్ మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య జిల్లా అధికార ప్రతినిధి శోభ మాదిగ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త :** నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను సోమవారం ఉచితంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ చేతుల మీదుగా ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వధ్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఖళాశాల ప్రిన్సిపాల్ రవిందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదవుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిందని తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎంపిసి, బిపిసి, సిఈసి, హెచ్‌ఈసి గ్రూపులలో అడ్మిషన్ లు ప్రారంబమైనట్లు తెలిపారు. ఈమేరకు ఆసక్తి గల విద్యార్తులుస్వయంగా వచ్చి అడ్మిషన్‌లు పొందవచ్చని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విధ్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈఆడ్మిషన్ అయిన వదధ్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యముందని ప్రిన్సిపాల్ రవిందర్ తెలిపారు. ఈకార్యక్రమంలో లెక్చరర్‌లు రాజేశ్వర్, ప్రణీల్ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలి

### బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం



మాట్లాడుతున్న చంద్రం

**సిద్ధిపేట రూరల్, జూన్ 24, ప్రభాతవార్త :** భవన నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన, గాయపడిన కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీని కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడిన తక్షణ సాయం కింద బాధితులకు రూ.5లక్షలతో పాటు కోలుకునే వరకు నెలకు రూ.5 వేలు అందించాలన్నారు. ఎపిలో సిఎం చంద్రబాబు ప్రభుత్వం భవన కార్మికుల కోసం రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తింప చేసిందన్నారు. తెలంగాణలో సిఎం రేవంత్ రెడ్డి భవన కార్మికులపై ప్రత్యేక చొరవ తీసుకొని బీమాను తీసుకురావాలన్నారు. గతంలో రేవంత్ రెడ్డి టిపిసిసి అధ్యక్షులుగాఉన్న సమయంలో భవన నిర్మాణ కార్మికుల పక్షాన వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తున్న సమయంలో అనేక ప్రమాద సంఘటనలు జరుగుతున్నాయని గత ప్రభుత్వం కార్మికులను పట్టించుకోకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు.

ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి కార్మికుల పక్షాన నిలబడి న్యాయం చేయాల న్నారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు అకుల ప్రశాంత్, తోట్ల నర్సింలు, కోటగిరి పరుశ రాములు, తోట్ల కిషన్, దరిపల్లి ఎల్లయ్య, తలారి ఎల్లం, ఉల్లిగడ్డల పెద్ద రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత రైతులకు న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, జూన్ 24, ప్రభాతవార్త:** జిన్నారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1 జంగంపేట సర్వే నంబర్ 376 రైతులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్, జిన్నారం ఎంపీటీసీ కోరబోయిన లావణ్యనరేష్ రైతులతోకలిసి జిన్నారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా రైతుల భూములు తీసుకొని ఇప్పటివరకు రైతులకు ఎలాంటి పరిహారం అందించలేదని, గత ప్రభుత్వం రైతులను మభ్యపెట్టి మోసం చెసి వందల ఎకరాలు రైతుల దగ్గర నుండి తీసుకొని పెద్ద పెద్ద పరిశ్రమ యాజమాన్య కంపెనీలకు అప్పచెప్పి లబ్ధిపొంది, రైతులకు న్యాయం చేయకపోవడం బాధాకరమని వాపోయారు. రైతుల భూములు తీసుకొని ఎకరాకు 600 గజాలు ఇస్తామని చెప్పి మోసం చేసి గజం స్థలం చూపించకపోవడం సిగ్గుచేటన్నారు. అనాటి ప్రభుత్వానికి తొత్తులుగా మారి మరి కొంత మంది నాయకులు చీకటి ఒప్పందాలు చేసుకొని రైతులను మభ్యపెట్టి మోసం చేశారని ఆరోపించారు. వ్యవసాయం మీద ఆధారపడిన జీవన ఉపాధి చేసుకునే రైతులందరూ తమ పొలాలను కోల్పోయి నానా ఇబ్బందులు పడుతున్నారని మరిన్ని రోజులు ఇలాగే ఉంటే రైతులు తమ భూముల్లో కెళ్లి దున్ని సాగు చేసుకుంటారని హెచ్చరించారు. ఇప్పటికైన రైతులకు న్యాయం జరిగే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిన్నారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే క్రిష్ణ, ఉపాధ్యక్షులు రాజుగౌడ్, జిన్నారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్ జిన్నారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ నాయకులు బత్తుల మహేష్ గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను పరిశీలన

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను సోమవారం బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఈ ఆలయంలో నడుస్తున్న పనులనూ ఆలయమంతా తిరిగి పనులను చూశారు. ఈ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వాస్తు నిపుణుల సూచనల ప్రకారం ఈ ఆలయాన్ని నిర్మాంచాలని అన్నారు. ఈమేరకుఈ ఆలయ నిర్మాణ పనులను చేస్తున్న మేస్త్రీలకు పలు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ కోరారు.

## గురుకుల డిగ్రీ కళాశాలకు సీలింగ్ ఫ్యాన్‌లు అందజేత

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 24, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీలో నూతనంగా ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర గురుకుల డిగ్రీ కళాశాలకు మున్సిపల్ ఛైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ రూ.25వేల విలువగల సీలింగ్ ఫ్యాన్‌లు బహూకరించారు. కళాశాలలో ఫ్యాన్‌లు లేనందున విద్యార్థినీలకు ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని ప్రిన్సిపాల్ ఛైర్మెన్ దృష్టికి తెచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన కళాశాలకు 10 సీలింగ్ ఫ్యాన్‌లను ఆన్‌లైన్‌లో తెప్పించి మున్సిపల్ సిబ్బంది ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సబితలకు అందజేశారు. అంతే కాకుండా మున్సిపల్ బోరునుండి కళాశాలకు నీటి సౌకర్యం కల్పించినందున ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది, విద్యార్థినీలు మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**హుస్నాబాద్ టౌన్, జూన్ 24, ప్రభాతవార్త :** పట్టణానికి చెందిన తొలితరం వైద్యులు బొద్దున రంగయ్యతోపాటు శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ తల్లి పైదరి లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో జడ్పివైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి,హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి,మాజీ జడ్పిటిసి మాలోతు భీలునాయక్,మాజీ ఎంపిపి ఆకుల వెంకట్ సీనియర్ నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డితో పాటు పాల్గొన్నారు.

## బైండోవర్ ఉల్లంఘనపై జరిమానా

**హుస్నాబాద్ రూరల్, జూన్ 24,ప్రభాతవార్త :** హుస్నాబాద్ ఎక్సైజ్ పరిధిలోని కోహెడ మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన సంపగి బాలయ్య అనే వ్యక్తి గతంలో గుడుంబా విక్రయించిన నేరంలో తహశీల్దార్ ముందు బైడోవర్ అయి మరల గుడుంబా అమ్మను అని హామీ ఇచ్చి మళ్లీ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా బైండోవర్ ఉల్లంగించిన తనకు సోమవారం కోహెడ తహశీల్దార్ ఆదేశాల మేరకు రూ20వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా గుడుంబా విక్రయించినా తయారు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



జరిమాన రశీదు అందిస్తున్న సిఐ పవన్ కుమార్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తదితరులు

## సంగారెడ్డి కెనాల్ రీచ్ 2లో నిర్మాణానికి రైతులు సహకరించాలి : ఆర్డీవో

**నర్సాపూర్ జూన్ 24. ప్రభాతవార్త :** సంగారెడ్డి కెనాల్ రీచ్ 2లో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులు కెనాల్ నిర్మాణానికి సహకరించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని రైతు వేదిక భవనంలో సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న శివ్వంపేట మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన భూనిర్వాసితుల రైతులతో అవార్డు విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూనిర్వాసిత రైతుల తమ అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని అధికారులు కోరడం జరిగింది. ఈమేరకు భూనిర్వాసిత రైతులు ప్రస్తుతం భూముల దరలు చాలా ఎక్కువగా ఉన్నందున ఎకరానికి 60 లక్షలు ఇవ్వాలని లేనిపక్షంలో భూమికి బదులు భూములు ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి కెనాల్ రీచ్ 2 లో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు ప్రభుత్వ నిభందనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారాన్ని చెల్లించడం జరుగుతుందన్నారు. భూనిర్వాసితులు తెలిపిన అభ్యంతరాలను నిర్ణయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయించడం జరుగుతందనిఇందుకు రైతులందరు తమకు సహకరించాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నర్సాపూర్‌నియోజకవర్గ ఇంచార్జీ మిర్యాల చంద్రశేఖర్‌తో పాటు పెద్దగొట్టిముక్ల గ్రామంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసిత రైతులు, అదికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రభలకుండా చర్యలు

### మున్సిపల్ కమిషనర్ దేవేందర్

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 24, ప్రభాతవార్త :** ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు రామాయంపేట మున్సిపల్ కమీషనర్ దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రామాయంపేట మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగిందన్నారు. సమా వేశంలో పలు అభివృద్ధి పనుల ఆమోదం పొందినట్లు తెలిపారు. అత్యవసర విభాగం క్రింత సీజనల్ వ్యాధులు ప్రభలకుండా పట్టణ వీధులలో దోమల మందు పిచికారీ, ఫాగింగ్, బ్లీచింగ్‌లతో పాటు త్రాగునీటి సమస్య, వీధి దీపాల మరమ్మతులు చేయడానికి తీర్మానించినట్లు పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ప్రతి వార్డుకు రూ.10 లక్షల చొప్పున పలు అభివృద్ధి పనులకు తీర్మానించి ఆమోదించనైనదని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ, మున్సిపల్ కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యుల పాల్గొన్నారని తెలిపారు.

# డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

- కుంటలను తలపిస్తున్న మురుగుకాలువలు
- ఈగల, దోమలకు ఆవాసాలుగా మారి రోగాల పాలవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బాలాజీ కళామందీర్ క్రాస్ వద్ద కుంటను తలపిస్తున్న మురిగి కాలువ

**చేర్యాల, జూన్ 24, ప్రభాతవార్త :** చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని డైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నూతనంగా నిర్మించిన డ్రైనేజీల్లో చెత్తా, చెదారం చేరి మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి పోయింది. మురుగునీరు ముందుకు వెళ్లకుండా నిల్వ చేరి కుంటలను తలపిస్తోంది. అక్కడక్కడ పూర్తి స్థాయిలో డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో కుంటలుగా ఏర్పడటంతో దోమల, ఈగలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కాల్వల నిర్మాణాల సమయంలో కాంట్రాక్టర్లు సరైన నిబంధనలు పాటించకుండా, నేల ఎత్తుపల్లాలను సరిగా అంచనా వేయకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి పోయింది. చిన్నపాటి చినుకులతో మోరీలన్ని నిండి కంపుకొట్టడమే గాక దోమలు ఎక్కువగా ఇండ్లలోకి వస్తున్నాయని రాత్రయితే ఇండ్ల, రోడ్లపై ఉండలేక పోతున్నామని ప్రజలు తెలుపుతున్నారు. రానున్న రోజుల్లో భారీగా వర్షాలు కురిస్తే డ్రైనేజీల్లో నుంచి మురుగునీరు రోడ్లపైకి రావడమేకాక దుర్గందం వెదజల్లి ప్రజలు అనారోగ్యాల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చేర్యాల మున్సిపాలిటి పరిధిలో కంపుకొడుతున్న డ్రైనేజీ మురికి కాలువల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



బైకుకు గుంటుకతో కలుపును నివారిస్తున్న దృశ్యం

## బైక్‌కు గుంటకతో కలుపు నివారణ

### -ఎకరానికి వేయి రూపాయల మిగులు

**నాగల్‌గిద్ద, జూన్ 24, ప్రభాతవార్త:** కూలీల కొరతకు రైతుల ఆలోచనలు రాటుదేలుతున్నాయి. కూలీలు అందుబాటులో లేక, ఉన్నా కూలీల డబ్బులు చెల్లించే స్థోమత లేక వ్యవసాయానికి సెలవు ప్రకటించే పరిస్థితిని అదిగమించేలా రైతులు వినూత్న పద్ధతిని పాటిస్తున్నారు. పంటల సాగు చేసిన పక్షం, 20 రోజుల్లో కలుపు నివారణకు కూలీలు అత్యవసరం. ఎకరం భూమిలో కలుపు నివారణకు రూ. 1500 వరకు కూలీలు డిమాండ్ చేస్తూ ఉంటారు. రూ. 1500 చెల్లించినా కూలీలు సకాలంలో దొరుకతారని చెప్పే పరిస్థితి నేడు లేదు. పత్తి పంటలో కలుపు నివారణకు రైతులు సైకిల్ మోటారుకు గుంటుక కట్టి సునాయాసంగా కలుపును నివారిస్తున్నారు. సోమవారం నాగల్‌గిద్దలో పత్తి పంటలో సైకిల్ మోటారుతో కలుపును నివారించే తీరును డివిజన్ వ్యవసాయ శాఖ అధికారులు రైతు రాంశెట్టి వ్యవసాయ పొలంలో పరిశీలించారు. ఒక ఎకరం భూమిలో కలుపు నివారణకు కేవలం రూ. 500 సరిపోతాయని, దీంతో ఎకరం భూమిలో రైతు రూ. 1000 వరకు ఆదా చేసుకోవచ్చని డివిజన్ వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అధికారులు పలు సూచనలు చేశారు. విత్తిన 25 రోజుల సమయంలో కలుపు నివారణకు గుంటక తోలాలన్నారు. పక్షం రోజులకు ఒక మారు గుంటకు తీలాల్సి ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేస్తే అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని ఏడిఏకె నూతన్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, ఏఈఓ మహిపాల్, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## మహా గణపతి ఆలయంలో పూజ

**చిన్నశంకరంపేట, జూన్ 24,ప్రభాతవార్త:** మండల పరిధి గవ్వలపల్లిలో మహాగణపతి ఆలయంలో నేడు సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటి తెలిపింది. కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

## వివాహానికి ఆర్థిక సహాయం అందించిన జడ్పిటిసి

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త :** శివ్వంపేట మండలం దొంతి గ్రామం మైనార్టీ వర్గానికి చెందిన సాజిదా కూతురు సమీరా వివాహానికి ప్రముఖ సంఘ సేవకులు, శివ్వంపేట జడ్పిటీసి పబ్బ మహేశ్‌గుప్త రూ.10 వేల ఆర్థికసహాయాన్ని అందించారు.కార్యక్రమంలో బిఆర్ఎస్‌పార్టీ మండల మాజీ అధ్యక్షులు పిట్ల సత్యనారాయణ,గ్రామ కమిటీ అధ్యక్షులు చాకలి సత్యనారాయణ, గంగం శ్రీనివాస్ శ్రీకాంత్‌రెడ్డి, కుమ్మరికృష్ణ, గౌస్ పాల్గొనప్నారు.

## పర్యాటక కేంద్రంగా రాయరావు చెరువు

### మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



నాటిన మొక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త:** పట్టణంలోని రాయరావు చెరువును సుందరీకరణ చేసి ఒక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన రాయరావు చెరువు కట్టపై నాటిన మొక్కలను పరిశీలించారు. చెరువును సుందరీకరణ చేయడంలో భాగంగా నాటిన మొక్కలకు సాసరింగ్, ట్రిమ్మింగ్, వీడింగ్ దగ్గరుండి చేయించడం జరిగింది. అలాగే చెరువు కట్ట మీదగల గార్డెన్‌ను పరిశీలించి మొక్కల పరిరక్షణపై సిబ్బందికి పలు సూచనలు సలహాలను ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువు కట్టపై ప్రజలు వాకింగ్ చేయడానికి వీలుగా రోడ్డును, కూర్చోవడానికి బెంచీలను, వ్యాయామం చేయడానికి పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రాములు, శానిటెరి ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్,, ఫైజాన్, సైఫ్, మున్సిఫల్ సిబ్బంది, హరిత హారం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన దీపిక

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త :** నూతన మండల వ్యవసాయాధికారిగా మిట్టపల్లి దీపిక నియమితులయ్యారు. ఈమేరకు ఆమె సోమవారం మండల వ్యవసాయాదికారిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. కాగా ఇక్కడ ఏవోగా విధులు నిర్వహించిన ఇన్‌చార్జీ మండల వ్యవసాయాదికారి దొంతి వెంకటరాజశేఖర్ నుండి ఆమె పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయ శాఖ చేపట్టే కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను అందేలా చూస్తానన్నారు. అంతేగాక ప్రతి మంగళవారం నర్సాపూర్‌లోని రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని రైతులు అదిక సంఖ్యలో హాజరు కావాలని ఏవో దీపిక తెలిపారు.

## విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ

**నర్సాపూర్, జూన్ 24, ప్రభాతవార్త :** పట్టణంలోని జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు సోమవారం మున్సిపల్ చైర్మన్‌అశోక్‌గౌడ్ యూనిఫామ్‌లను పంపిణి చేశారు. అనంతరం అశోక్‌గౌడ్ మాట్లాడుతూ, విద్యార్థులు శ్రద్దగా చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విఠల్, ఉపాధ్యాయులు సామ్యానాయక్, వీరేశం, రమేష్, సుచిత్ర, సమాజా బేగం, వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబల్ల బిక్షపతి, నాయకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బజరంగ్ దళ్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**రామాయంపేట, జూన్ 24, ప్రభాతవార్త :** రామాయంపేట మండలం అక్కన్నపేట బజరంగ్‌దళ్ గ్రామ కమిటీని ప్రఖండ అధ్యక్షుడు తాటిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయడం జరిగింది. గ్రామ సంయోజక్ (అధ్యక్షుడు)గా బక్కయ్యగారి రమణ, సహ సంయోజకులుగా సందీప్, వంశీ విద్యార్థి ప్రముఖ్ శివసాయి, సహ ప్రముఖులుగా చంద్రశేఖర్, దినేష్, గోరక్ష ప్రముఖ్ శ్రీనివాస్, నవీన్, మహేష్, సప్తాహిక్ ప్రముఖ్ సందీప్, సంపత్, సాయిచరణ్, సేవ ప్రముఖ్ పురుషోత్తములను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రఖండ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం కోసం, హిందూ ధర్మం కోసం యువకులు ముందుకు వచ్చి పనిచేయాలని, దేశంలోపల వీధర్మియుల యొక్క శక్తులను అరికట్టడంలో ముందుండాలని, ధర్మ వీడినటువంటి సోదరులను తిరిగి మన ధర్మంలోకి తీసుకురావాలని కోరారు. గోవులని కాపాడాలని, గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సాహించాలని తగు విషయాలను గ్రామ కమిటీకి తెలియజేయడం జరిగింది. గ్రామ సంయోజక ఎన్నికైన రమణ మాట్లాడుతూ కలిసికట్టుగా ఉండి హిందూ ధర్మాన్ని రక్షిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ